అధ్యక్షా..



ఐదేళ్లలో ఒక్క పనీ జరగలేదు



గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా నేను తిరిగి తిరిగి కొన్ని రోడ్డు పనులు శాంక్షన్ చేసుకున్నా. రూ.33 కోట్లతో 36 రోడ్డు పనులు మంజూరైతే అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చెందిన పీఎల్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ వాటిని దక్కించుకుని కేవలం ఆరు రోడ్లే వేసింది. మిగిలినవి పెండింగ్‌లో పెట్టేసింది. ఎన్‌డీపీ కింద రూ.40 కోట్లతో 'నాగలాపురం - చిన్నపాండూరు' రోడ్డు విస్తరణ పనులూ వాళ్లే తీసుకుని చేయలేదు. ఇలా ఒక్క పని కూడా చేయకుండా.. ఆదిమూలం చేయలేదు అంటూ ప్రచారం చేశారు. నా నియోజకవర్గంలో పెద్దిరెడ్డి చెట్లు, మట్టి, ఇసుక అమ్ముకుని సహజ వనరులను దోచుకుంటూ నాపై నిందలు వేశారు. డిగ్రీ కాలేజీ పడిపోయేలాగా ఉంది. కొత్త భవనాల కోసం ఐదేళ్లు తిరిగినా ఫలితం లేదు. నా నియోజకవర్గంలో పీఆర్, ఆర్‌అండ్‌బీ రోడ్లు ఒక్కటీ జరగలేదు. దాసుకుప్పం బైపాస్ రోడ్డుకు రూ.26 కోట్లు శాంక్షన్ అయితే పనులు జరగలేదు. గ్రామీణ ప్రాంతాల్లో శ్మశానాలకు దారి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ పనులన్నీ మన ప్రభుత్వంలో చేపట్టి పూర్తిచేసి ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి. అందుకు మీ సహకారం కావాలి.

\- ఆదిమూలం, సత్యవేడు ఎమ్మెల్యే

ఎమ్మెల్యే రోజా!

- మాజీ అయినా.. కారుపై మారని స్టిక్కర్



రోజా కారుపై ఉన్న స్టిక్కర్

సత్యవేడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): 'ఎమ్మెల్యే రోజా'.. అదేంటి మాజీ అయిపోయారుగా అనుకుంటున్నారా? కానీ, ఆమె కారుకు ఇంకా ఎమ్మెల్యే రోజా అనే స్టిక్కర్ ఉంది. సోమవారం ఆమె తిరుపతి జిల్లా సత్యవేడుకు వచ్చిన కారులో ఎమ్మెల్యే ఆర్‌కే రోజా అని పెద్ద పెద్ద అక్షరాలతో స్టిక్కర్ ఏర్పాటు చేసుకోవడం చూసి పలువురు విస్మయం వ్యక్తం చేశారు. కాగా, ఇటీవల నగరిలో జరిగిన గొడవల నేపథ్యంలో సత్యవేడు సబ్‌జైలులో విచారణ ఖైదీలుగా ఉన్న వైసీపీ నేతలను సోమవారం ఆమె ములాఖత్ ద్వారా పరామర్శించారు. జైలు వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. ఎప్పుడో ఐదారేళ్ల క్రితం మాట్లాడిన మాటలతో ఇప్పుడు మనోభావాలు దెబ్బతిన్నాయని పోసాని కృష్ణ మురళిని అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. ఆయనకు ఆరోగ్యం బాగాలేకున్నా, అరెస్ట్ చేశారన్నారు. తాము అధికారంలోకి వచ్చాక వడ్డీ సహా తిరిగి చెల్లిస్తామన్నారు. నగరిలో వైసీపీ నాయకలను లక్ష్యంగా చేసుకుని కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు.

స్వర్ణముఖినది మీదుగా నిర్మించిన మట్టి దారి



స్వర్ణముఖి నదికి అడ్డంగా మట్టి రోడ్డు వేశారు. అదీ తిరుపతి నగరానికి సమీపాన.. నిత్యం వందలాది మంది పాదచారులు, వాహనదారులు రాకపోకలు సాగించే తనపల్లె తాత్కాలిక వంతెన పక్కనే నిర్మాణం చేపట్టారు. నది మీదుగా ఇలాగా కూడా దారి నిర్మించవచ్చా అని జనం అవాక్కవుతుంటే.. అధికారులేమో తమకు సంబంధం లేదన్నట్లుగా ఉంటున్నారు.

\- తిరుపతిరూరల్, ఆంధ్రజ్యోతి



స్వర్ణముఖి నదిలో 'అడ్డ దారి'!

- అవతలివైపు లే అవుట్ కోసం నిర్మాణం
- పట్టించుకోని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

నిలుపుదల చేయమని చెప్పాం

స్వర్ణముఖి నదికి అడ్డంగా దారి నిర్మాణానికి అనుమతిలేదు. నిలుపుదల చేయాలని ప్లాట్ల యజమానులకు సూచించాం. ఇప్పటికే ఆర్డీవో, రూరల్ తహసీల్దార్, గ్రామపంచాయతీ అధికారులకు కూడా ఫిర్యాదు చేశాం.

\- రవిశంకర్, ఇరిగేషన్ ఏఈ

తిరుపతిరూరల్ మండలం తనపల్లె తాత్కాలిక వంతెనకు ఆనుకుని అవతలివైపున్న తిరుచానూరు పంచాయతీకి చెందిన ప్రైవేట్ భూమిలో వేసిన లేఅవుట్‌లో పలువురు గతంలో ప్లాట్లను కొనుగోలు చేశారు. ఎల్‌ఆర్‌ఎస్‌కోసం అప్పట్లో కొందరు తుడాకి నగదు చెల్లించారు. ఈ లేఅవుట్‌ను పరిశీలించిన తుడా అధికారులు దీనికి సరైనదారిలేకపోవడంతో ఎల్‌ఆర్‌ఎస్ ఇవ్వలేదని సమాచారం. దీంతో ప్లాట్ల కొనుగోలుదారుల్లో కొందరు ముందుకొచ్చి కమిటీని ఏర్పరచుకున్నారు. ఈక్రమంలో ప్లాట్లయజమానుల ఫోన్ నెంబర్లని సేకరించి ఒక్కో అంకణానికి రూ.వెయ్యి చొప్పున వసూలు చేసి నదిమీదుగా మట్టిదారి నిర్మాణం చేపట్టారనే ప్రచారం జరుగుతోంది. వర్షాకాలంలో నదిలోకి నీరుచేరితే ఇబ్బందులు ఎదురవుతాయని కొందరు సూచించినా వినలేదని తెలిసింది. వర్షాకాలం రాకముందే రోడ్డుకి రివిట్‌మెంట్ నిర్మిస్తామని చెప్పారని సమాచారం. ఇలా కమిటీలోని కొందరు ముఖ్యులు పట్టుపట్టి నదిలో దారి వేసినట్లు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వ భూమిని (వాటర్‌బాడీస్) పరిరక్షించాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఇంత జరుగుతున్నా తెలిసీతెలియనట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు దారితీస్తోంది. కాగా, జనవరిలో నదీమీదుగా ఇదే దారిని నిర్మించేందుకు ఎక్స్‌కవేటర్ సాయంతో పనులు చేపట్టారు. ఈ సమాచారంతో స్థానిక వీఆర్వో స్పందించి సర్వేనంబరు 360కి సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో నదిపోరంబోకుగా నమోదైఉందని, దీనిలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని అడ్డుకున్నారు. అప్పట్లో కొన్ని రోజులపాటు పనులను ఆపేశారు. తిరిగి రెండునెలలు తిరగకముందే దాదాపుగా పూర్తిస్థాయిలో మట్టిదారి నిర్మాణం పూర్తయిపోతోంది.


ధ్వజావరోహణం సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



ముక్కంటి ఆలయంలో శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం

శ్రీకాళహస్తి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం నిర్వహించారు. స్వామివారి గర్భాలయానికి ఎదురుగా ఉన్న ధ్వజస్తంభంపై వృషభ సంకేత ధవళ పతాకాన్ని అవనతం చేశారు. అంతకుముందు అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ధ్వజస్తంభం వద్దకు తీసుకువచ్చి కొలువుదీర్చారు. ఆ తరువాత యాగశాలలో పది రోజుల నుంచి పూజలందుకున్న స్వామి అమ్మవార్ల ఆవాహన కలశాలకు పూజలు చేశారు. యాగశాల నుంచి కలశాలను అర్చకులు తలపై పెట్టుకుని ఆలయంలో ప్రదక్షిణ చేసిన అనంతరం స్వామివారి ధ్వజస్తంభం వద్దకు తీసుకొచ్చి.. ఆగమోక్తంగా కలశ ఉద్వాసన పలికారు. చివరిగా ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేసి ధ్వజవరోహణ క్రతువును పూర్తి చేశారు. ధ్వజస్తంభానికి ఏర్పాటుచేసిన దవళ పతాకం, దారాన్ని చతుర్మాడవీధుల్లో కొలువైన నవ సంధి వినాయకులకు దర్శింపచేశారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వాహన సేవలు

మహాశివరాత్రి ఉత్సవాల్లో 11వ రోజైన సోమవారం ఉదయం స్వామి అమ్మవార్లకు కేడిగ వాహన సేవ నిర్వహించారు. రాత్రి శ్రీకాళహస్తీశ్వరుడు సింహాసనం, పార్వతీదేవి కామధేనువుపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. పురవీధుల్లో ఊరేగుతున్న పార్వతీ పరమేశ్వరులకు భక్తులు కర్పూర హారతులు సమర్పించారు.

తిరుమలలో బాలిక కిడ్నాప్

- వెంట తీసుకెళ్లిన పారిశుధ్య కార్మికురాలు
- తల్లిదండ్రుల ఫిర్యాదుతో గాలింపు
- మూడున్నర గంటల్లోనే తిరుపతిలో గుర్తించిన పోలీసులు


దీక్షిత (ఫైల్ ఫొటో)


సీసీ ఫుటేజీలో గుర్తించిన కిడ్నాపర్ ఈమె

తిరుమల, మార్చి3 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో సోమవారం కిడ్నాప్ అయిన నాలుగేళ్ల బాలికను.. మూడున్నర గంటల్లోనే పోలీసులు పట్టుకున్నారు. తమ బిడ్డ కనిపించడం లేదంటూ తల్లిదండ్రులు ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు రంగంలోకి దిగి.. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా బాలికను, ఆమెను తీసుకెళ్లిన మహిళను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విజయవాడకు చెందిన నరసింహులు దంపతులు తమ నాలుగేళ్ల కుమార్తె దీక్షితతో కలిసి గతేడాదిగా తిరుమలలోని చిరువ్యాపారులుగా జీవనం సాగిస్తున్నారు. సోమవారం సాయంత్రం తమ కుమార్తె ఆడుకుంటున్న సమయంలో వీరు పనుల్లో నిమగ్నమయ్యారు. రాత్రి 7 గంటల సమయంలో దీక్షిత కోసం గాలించగా ఎక్కడా కనిపించలేదు. దీంతో తమ కుమార్తె కనిపించడం లేదంటూ విజిలెన్స్, పోలీసులను ఆశ్రయించారు. వెంటనే కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరుకుని సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించారు. గుర్తుతెలియని మహిళ దీక్షితను వెంట తీసుకెళ్లినట్టు గుర్తించారు. సాయంత్రం 6.30 గంటల సమయంలో బాలిక సహా ఏపీ 03 జెడ్ 5587 నెంబరు గల ఆర్టీసీ బస్సు ఎక్కి తిరుపతికి వెళ్లినట్టు కెమెరాల్లో రికార్డయింది. వినాయకనగర్ సమీపంలో బస్సు దిగినట్టు గుర్తించిన పోలీసులు బృందాలుగా విడిపోయి గాలించారు. ఎట్టకేలకు రాత్రి 10.30 గంటల సమయంలో తిరుపతిలోని పెద్దకాపు లేఅవుట్‌లోని ఓ ఇంట్లో చిన్నారిని, మహిళను గుర్తించారు. చిన్నారిని తీసుకెళ్లిన మహిళ తిరుమలలో ఓ ప్రైవేట్ సంస్థలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికురాలు నాగ వెంకటరమణగా తేలింది. చిన్నారి ఒంటరిగా ఉందని, తనతో పాటు వస్తున్న క్రమంలోనే తీసుకొచ్చానే తప్ప మరో ఉద్దేశ్యం లేదని ఆమె తెలిపింది. అయినప్పటికీ పోలీసులు తమ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కాగా, బాలికను తిరుపతి నుంచి రాత్రి తిరుమలకు తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

ఆచూకీ తెలిపిన కోట్

బాలిక ఆచూకీ గంటల వ్యవధిలోనే తెలుసుకోవడంలో మహిళ ధరించిన కోట్ కీలకంగా మారింది. సీసీ కెమెరాల ఫుటేజ్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసిన పోలీసులకు మహిళ ధరించిన దుస్తులపై ఓ సంస్థ పేరు కనిపించింది. దీంతో తిరుమలలోనే పనిచేసే ఉద్యోగి అయి ఉంటుందని భావించారు. కోట్‌పై ఉన్న సంస్థ పేరు ఆధారంగా ఆసంస్థలో పనిచేసే కొందరు ఉద్యోగులను పోలీసులు ప్రశ్నించారు. ఈక్రమంలోనే ఆ మహిళ పేరు, ఫోన్ నెంబరు తెలిసినట్టు సమాచారం. దీని ఆధారంగానే మహిళను అతి తక్కువ సమయంలో పట్టుకోగలిగారు.

కన్నులపండువగా వసంతోత్సవం


త్రిశూల స్నానం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం వసంతోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. నూతన వధూవరులైన శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబ ఉత్సవర్లను వసంతోత్సవ మండపంలో కొలువుదీర్చారు. స్వామిఅమ్మవార్లకు గోక్షీరం, పెరుగు, నెయ్యి, పసుపు, కుంకుమ, చందన, పంచామృత, విభూది, నారీకేళ, నదీ పుణ్యజలాలతో అభిషేకించారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపి కర్పూరహారతులు సమర్పించారు. ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం సూర్య పుష్కరణి వద్దకు అర్చకులు త్రిశూలాన్ని తీసుకొచ్చి అభిషేకాలు నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

రాత్రి 8గంటలకు: పల్లకీ సేవ


స్వామిఅమ్మవార్లకు అభిషేకం

ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- 29,355 మంది విద్యార్థులకుగాను 28,783 మంది హాజరు

తిరుపతి (విద్య), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొత్తం 100 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. తొలి రోజు సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2కు 29,355 మంది జనరల్, ఒకేషనల్ విద్యార్థులకుగాను 28,783 మంది పరీక్షకు హాజరుకాగా 572 మంది గైర్హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ చోటుచేసుకోలేదని ఆర్‌ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. మంగళవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్ లాంగ్వేజ్ పేపర్-1 పరీక్ష జరుగనుంది.


తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాల కేంద్రం వద్ద విద్యార్థులు

సత్యవేడులో పాము కలకలం

సత్యవేడు, ఆంధ్రజ్యోతి: సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో సోమవారం పాము కలకలం రేపింది. పరీక్షలు జరుగుతున్న సమయంలో ఒక పాము వచ్చి స్క్వాడ్ అధికారి కాలుకు చుట్టుకుంది. దీంతో అప్రమత్తమైన ఆయన వెంటనే విదిలించడంతో పాము దూరంగా పడిపోయి వెళ్లింది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళవారం) : 6.24

సహరి (బుధవారం) : 5.08

వెటర్నరీ విద్యార్థుల వినూత్న నిరసన



ఆవుదూడకు పూలదండలు వేసి నిరసన తెలుపుతున్న వెటర్నరీ విద్యార్థులు

తిరుపతిరూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారమూ కొనసాగింది. వర్సిటీ ప్రధాన గేటు ఎదురుగా ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో కుక్క, పిల్లి, ఆవు దూడకు పూలదండలు వేసి, వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. జంతువులే తమకు దేవుళ్లని, వాటిని గౌరవించి..పూజచేసి తమగోడు వినిపించామని అన్నారు. రైతు, ఐక్య విద్యార్థి సంఘాల ప్రతినిధులు సమ్మెకు సంఘీభావం తెలిపి మద్దతు ప్రకటించారు.

ఇళ్ల రెగ్యులరైజ్‌కి దరఖాస్తు చేసుకోండి

తిరుపతి రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని పంచాయతీల్లో 2019కి ముందు అనాధీనం భూమిలో ఇళ్లు నిర్మించుకుని ఎటువంటి వివాదాలు లేకుండా ఉంటే గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌ని సంప్రదించి రెగ్యులరైజ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రామాంజులునాయక్ పేర్కొన్నారు. ఈ దరఖాస్తులను పరిశీలించి స్థల వివాదంలేని ఇళ్లకు రెగ్యులరైజ్ చేసుకునే వెసులుబాటు ఉందని తెలిపారు. స్లాబ్ల మేరకు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

నేడు బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

పాకాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అరుణ తెలిపారు. బ్యాంకర్ల ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. మండలంలో 511 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువ పత్రాలతో హాజరుకావాలని కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా రమేష్ కుమార్



రమేష్ కుమార్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

పాకాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రమేష్ కుమార్ నియమితులయ్యారు. కళాశాలలో ఆంగ్ల అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఆయన ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ)గా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనను అధ్యాపకులు సత్కరించి, అభినందనలు తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ

పాకాల, మార్చి3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పదవ తరగతి విద్యార్థులకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పంపిన విద్యాసామగ్రిని సోమవారం టీడీపీ నాయకులు అందజేశారు. పాకాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, దామలచెరువు, కె.వడ్డేపల్లె, మొగరాల, గాదంకి, ఓటులశెట్టివారిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు పరీక్ష రాయడానికి అవసరమైన కిట్లను పంపిణీ చేశారు.

పాల ఉత్పతులు-వినియోగంపై విద్యార్థులకు క్విజ్

ఎర్రావారిపాలెం, మార్చి 3(ఆంధ్రజ్యోతి); మండలంలోని ఎర్రావారిపాలెం, మట్టివారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పాల ఉత్పతులు-వినియోగం అనే అంశంపై సోమవారం క్విజ్ నిర్వహించారు. శ్రీజ డెయిరీ, జైకా సంస్థలు సంయుక్తంగా చేపట్టిన ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం పిల్లలందరికీ శ్రీజ క్యారీ బ్యాగులు పంపిణీ చేశారు. భాకరాపేట ఏరియా మేనేజర్ భాస్కర్ రెడ్డి, పీఐబీ కేశవ, సూపర్ వైజర్ చిరంజీవి పాల్గొన్నారు.

విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ

తిరుపతిరూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కళాశాలలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా బజాజ్ ఫిన్ సర్వ్ సంస్థ ఎంబీఏ విద్యార్థులకు సోమవారం నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం నిర్వహించింది. ప్రోగ్రామ్ ఇన్‌చార్జి రామకృష్ణ మాట్లాడుతూ బజాజ్ ఫిన్ పోగ్రామ్ ద్వారా బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ కమ్యూనికేషన్లతో పాటు స్కిల్‌లో తమ కంపెనీ నిపుణులు అవగాహన కల్పిస్తారన్నారు. సోమవారం నుంచి 96 గంటల పాటు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వాల్ చంద్ పీపుల్స్ ప్రాజెక్టు హెడ్ రష్మి మన్సుచారి, ఎస్వీసీఈ కళాశాలల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి, ఎంబీఏ శాఖ ప్రొఫెసర్ నీరజ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు



వాహనదారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి

తిరుచానూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి తెలిపారు. ఆయన మాట్లాడుతూ సోమవారం తిరుచానూరు హైవేపై రాంగ్ రూట్లో వస్తున్న 25 ద్విచక్ర వాహనాలతో పాటు ఒక ఆటోను సీజ్ చేశామన్నారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో తిరుచానూరు సీఐ సునీల్, ట్రాఫిక్ సీఐ భాస్కర్‌నాయక్, ఎస్ఐ సాయిచౌదరి పాల్గొన్నారు.

తిరుపతిలో ముమ్మరంగా వాహన తనిఖీలు

రికార్డులు లేని 24 వాహనాలు సీజ్

తిరుపతి(నేరవిభాగం), మార్చి 3(ఆంధ్రజ్యోతి): నగరంలో పోలీసులు సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న, రికార్డులు లేని 24 వాహనాలను సీజ్ చేశారు. ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి నేతృత్వంలో తిరుపతి రూరల్ పరిధిలోని తనపల్లి క్రాస్ నుంచి ఆర్‌సీపురం జంక్షన్ వరకు తనిఖీలు చేశారు. రికార్డులూ లేని 17 ద్విచక్ర వాహనాలు, ఆరు కార్లు, ఒక జేసీబీని సీజ్ చేసి కేసులు నమోదు చేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 25 మందిపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 25 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వీరిని సోమవారం తిరుపతి నాలుగవ అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ ఎదుట హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున 25 మందికి రూ.2.50 లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు సహకరించాలి

చంద్రగిరి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు యువత సహకారించాలని సీఐ సుబ్బరాయుడు కోరారు. సోమవారం ఎ.రంగంపేట వద్ద ఎంబీయూ సమీపంలో ప్రైవేటు హాస్టల్ విద్యార్థులకు అసాంఘిక కార్యకలాపాల నిర్మూలన, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ సైబర్ క్రైమ్ నార్కోట్రిక్స్, గంజాయిపై అవగాహన కల్పించారు. గంజాయి సేవించడం వల్ల జరిగే అనర్థాల గురించి వివరించారు. ఎ.రంగంపేట పరిసర ప్రాంతాల్లో గంజాయి ప్యాకెట్లను గుర్తించి ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో పీజీ హాస్టళ్ల యాజమాన్యం, ఆటో డ్రైవర్లు, ఎస్టీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

చిరంజీవికి పలువురి శుభాకాంక్షలు



మిట్టపాలెంలో వేడుకలు నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

చంద్రగిరి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపాలెం పంచాయతీకి చెందిన టీడీపీ నేత చిరంజీవి జన్మదినం సందర్భంగా సోమవారం పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. గామంలో బుచ్చినాయుడుపల్లె మాజీ సర్పంచ్ వేణు ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి కేక్ కట్ చేశారు. టీడీపీ నాయకులు గురున్నాథం, లోకేష్‌రాయల్, శేఖర్, పవన్‌రాయల్ పాల్గొన్నారు.

చంద్రగిరి

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం



కానిస్టేబుల్ భార్యకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ శశికుమార్ కుటుంబానికి జిల్లా పోలీసు శాఖ తరఫున ఎస్పీ హర్షవర్ధన రాజు సోమవారం రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు. అతని భార్య రోహిణికి ఈ మేరకు చెక్కు అందించారు. శశికుమార్ కుటుంబానికి చేయూత ఇవ్వాలనే సదుద్దేశంతో ఉమ్మడి చిత్తూరు జిల్లా తరఫున దాదాపు రూ.1.21 లక్షలు సేకరించి ఎస్‌బీఐ స్మార్ట్ స్కాలర్ షిప్పు పాలసీ కింద చెక్కును అందజేసినట్లు చెప్పారు.

స్కౌట్స్ ద్వారా సమాజ సేవ

భాకరాపేట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు స్కౌట్స్ ద్వారా సమాజ సేవకు తోడ్పడతారని చిన్నగొట్టిగల్లు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం మృదులా దేవి అన్నారు. చిన్నగొట్టిగల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు శారీరక ధృఢత్వం పెరుగుతుందన్నారు. విద్యార్థులు స్కౌట్స్‌లో చేరి దేశ సేవకు అంకితం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో గైడ్స్ నారాయణ రెడ్డి, ప్రభావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

ఎర్రావారిపాలెం , మార్చి 3(ఆంధ్రజ్యోతి); జిల్లా బీసీ కార్పొరేషన్ ద్వారా రణాలు పొందేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపీడీఓ అరుణ తెలిపారు. మండలంలో 308 మంది లోన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు.

ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలి

ఎర్రావారిపాళెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) ఉద్యోగ, ఉపాధ్యాయులకు, పెన్షన్‌దారులకు వెంటనే ఐఆర్ ప్రకటించాలని ఎస్టీయూ నాయకులు అంజిమేటి మల్లీశ్వర్, మంచినీళ్ల వెంకటరమణ డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఉద్యోగులకు ఎన్నో ఆశలు కల్పించిందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. హామీలను అమలు చేయాలని కోరారు.

వైభవంగా త్యాగయ్య సంగీత మహోత్సవాలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న భానుప్రకాష్‌రెడ్డి, మునికృష్ణ, నరసింహయాదవ్, సుగుణమ్మ

తిరుపతి (ఉపాధ్యాయనగర్), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వాయిద్య కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సద్గురు త్యాగరాజస్వామి వారి సంగీత మహోత్సవాలు సోమవారం తిరుపతిలో అత్యంత వైభవంగా జరిగాయి. రామచంద్ర పుష్కరిణి ఆవరణలో ఎస్వీ సంగీత నృత్య కళాశాల మాజీ ప్రిన్సిపాల్ సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని టీడీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు జి.నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే ఎం.సుగుణమ్మ, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, టీటీడీ బోర్డు సభ్యుడు జి.భానుప్రకాష్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మునికృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై ఉత్సవాలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ భక్తాగ్రేసరులు, వాగ్గేయకారులు త్యాగరాజస్వామి జీవితం ఆచరణీయమన్నారు. శ్రీరామచంద్రుడే సర్వస్వంగా భావించి భక్తితో ఆయన రచించిన సంకీర్తనలు నేటి కళాకారులకే కాకుండా భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని చెప్పారు. అనంతరం నిర్వహించిన సాక్సాఫోన్ కచ్చేరి, నాదస్వర కచ్చేరి విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రముఖ నాదస్వర విద్వాంసులు విద్వాంస పండ్లూరి గోవిందశెట్టి, రుద్రకోటి సదాశివంను ముఖ్య అతిథులు, వాయిద్య కళాకారుల సంక్షేమ సంఘం వారు ఘనంగా సన్మానించారు. రాత్రి 10 నుంచి మంగళవారం తెల్లవారు జాము వరకు సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్వీ సంగీత నృత్య కళాశాల నాదస్వర విద్వాన్ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్వీయూ డీడీఈ డైరెక్టర్‌గా రమేష్‌బాబు

నేడు బాధ్యతల స్వీకరణ



నియామక ఉత్తర్వులు అందుకుంటున్న ప్రొఫెసర్ ఊకా రమేష్‌బాబు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ దూర విద్యా విభాగం నూతన డైరెక్టర్‌గా ప్రొఫెసర్ ఊకా రమేష్‌బాబు నియమితులయ్యారు. ఇప్పటివరకూ డీడీఈ డైరెక్టర్‌గా వ్యవహరించిన ప్రొఫెసర్ తవమణి ఇటీవల రాజీనామా చేశారు. ఈ క్రమంలో వర్సిటీ సౌత్ ఈస్ట్ ఏషియన్ అండ్ పసిఫిక్ (సీప్) స్టడీస్ ప్రొఫెసర్ ఊకా రమేష్‌బాబును నియమించారు. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు చేతుల మీదుగా ఆయన నియామక ఉత్తర్వులను సోమవారం స్వీకరించారు. మంగళవారం దూరవిద్య డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

నోటిఫికేషన్ విడుదలకు కసరత్తు

ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో దూరవిద్యా డిగ్రీ, పీజీ అడ్మిషన్లకు త్వరలో నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. మార్చి 31వ తేదీలోపు అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని ప్రయత్నం చేస్తున్నట్టు దూరవిద్యా నూతన డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్‌బాబు తెలిపారు. అలాగే దూరవిద్యా పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు హరినాయుడు మృతి



హరినాయుడు (ఫైల్ ఫొటో)

చంద్రగిరి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్‌రోడ్డుపల్లె పంచాయతీ కొత్తఇండ్లుకు చెందిన టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు దేశినేని హరినాయుడు(73) అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందాడు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. సోమవారం తీవ్ర అనారోగ్యం కారణంగా గుండెపోటుకు గురై మృతిచెందారు. చంద్రగిరి మండలంలో టీడీపీ సీనియర్ నాయకుడిగా, మండల అధ్యక్షుడిగా పార్టీకి విశేష సేవలందించారు. మృతి విషయం తెలియగానే మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

తిరుపతిలో మరో పరీక్షా కేంద్రానికి వచ్చి..



విద్యార్థులను అలిపిరి కేంద్రానికి తీసుకెళుతున్న సిబ్బంది

తిరుపతి (విద్య), ఆంధ్రజ్యోతి: ద్వితీయ ఇంటర్ పరీక్షలకు సంబంధించి ముగ్గురు విద్యార్థులకు అలిపిరి సమీపంలోని ఎస్వీ బధిరుల జూనియర్ కళాశాలను కేంద్రంగా కేటాయించారు. ఆ ముగ్గురు విద్యార్థులు సోమవారం పొరపాటున ఎల్‌బీసీ కాలనీ సమీపంలోని ఎస్వీ జూనియర్ కళాశాలకు వెళ్లారు. వారి హాల్ టికెట్లు పరిశీలించిన సిబ్బంది.. బధిరుల జూనియర్ కళాశాలకు వెళ్లాలని సూచించారు. అప్పటికే దాదాపుగా సమయం అయిపోవడంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. దీంతో ఎస్వీ జూనియర్ కళాశాల సిబ్బంది ఆ విద్యార్థులను ద్విచక్ర వాహనాలపై అలిపిరిలోని వారి సెంటర్‌కు తీసుకెళ్లారు.

టెన్త్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ శామ్యూల్

తిరుపతి(విద్య), మార్చి 3(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కడప ఆర్జేడీ శామ్యూల్ ఆదేశించారు. ఈ నెల 17 నుంచి 31వ తేదీ వరకు పరీక్షలు జరుగనున్నందున డీఈవో కేవీఎన్ కుమార్, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లతో సోమవారం స్థానిక కచ్చపి ఆడిటోరియంలో ఆయన సమావేశమయ్యారు. జిల్లాలో 164 కేంద్రాల్లో 28,656 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి లోటుపాట్లకూ తావు లేకుండా చూడాలని అన్నారు. ఈవో కేవీఎన్ కుమార్, డీసీబీ కార్యదర్శి వంశీరాజు, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గురుస్వామిరెడ్డి, తిరుపతి, పుత్తూరు, గూడూరు డీవైఈవోలు బాలాజీ, ప్రభాకర్‌రాజు, సనత్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం

చంద్రగిరి, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : చంద్రగిరి ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభమయ్యాయి. బాలుర జూనియర్ కళాశాలలోని ఏ సెంటర్‌లో 409 మంది విద్యార్థులు గాను 400 హాజరయ్యారు. 9 మంది గైర్హాజరయ్యారు. బీ సెంటర్లో 368 మందికి గాను 367 మంది హాజరయ్యారు. ఒక్కరు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏ సెంటర్లో 372 మందికి 367 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఐదుగురు గైర్హాజరయ్యారు. బీ సెంటర్లో 371 మందికి గాను 369 మంది హాజరయ్యారు. ఒక్కరు గైర్హాజరయ్యారు. పోలీస్ బందోబస్తు నడుమ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

హెల్త్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతిలో కౌన్సిల్‌దే తుది నిర్ణయం

బాధ్యతా రాహిత్య ఆరోపణలు తగదు - కమిషనర్ మౌర్య

తిరుపతి, మార్చి3(ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో హెల్త్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ కల్పించడంలో స్టాండింగ్ కమిటీ లేదా సాధారణ కౌన్సిల్ ఆమోదమే తుది నిర్ణయం తీసుకోవలసి వుంటుందని, ఇందులో కమిషనరుకు నిర్ణయాధికారాలు ఉండవని కమిషనర్ ఎన్.మౌర్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓ మహిళా ఉద్యోగి హెల్త్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ విషయంలో కొందరు అనవసరంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఖండించారు. కౌన్సిల్ లేని పక్షంలో తుది నిర్ణయం తీసుకునే అధికారం ప్రత్యేక అధికారిగా కమిషనర్‌కు ఉంటుందని పేర్కొన్నారు. హెల్త్ అసిస్టెంట్ పోస్ట్‌కు కావల్సిన విద్యార్హత ఇంటర్మీడియట్‌లో బైపీసీ లేదా ఎంపీసీ ఉంటే శానిటరీ జవాన్ నుంచి హెల్త్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించే వీలుంటుందని వివరించారు. కానీ తిరుపతి నగరపాలక సంస్థలో సదరు శానిటరీ జవాన్ పోస్టు లేనందున నిర్ధారించిన నాలుగవ తరగతి సీనియారిటీ జాబితాను అనుసరించి పదోన్నతి కల్పించేందుకు స్టాండింగ్ కమిటీకి అధికారం ఉందని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం స్టాండింగ్ కమిటీ లేనందున, గత నెల 20న జరిగిన కౌన్సిల్ సమావేశంలో హెల్త్ అసిస్టెంట్ పదోన్నతిపై కౌన్సిల్ అజెండాలో ఉంచామని తెలిపారు. సుదీర్ఘంగా చర్చించిన అనంతరం కౌన్సిల్ సభ్యుల అభ్యర్థన మేరకు కౌన్సిల్ తీర్మానం వాయిదా వేశామని పేర్కొన్నారు. తదుపరి సూచనల కోసం ప్రభుత్వానికి పంపడం జరుగుతుందన్నారు. ఈ వ్యవహారంపై తప్పుడు ఆరోపణలు బాధ్యతా రాహిత్యమని పేర్కొన్నారు.

నేడు యూనివర్సిటీలు, కాలేజీల బంద్

ఉమ్మడి పీజీ సెట్ రద్దు కోసం విద్యార్థి సంఘాల పిలుపు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పీజీ సెట్ రద్దు కోసం మంగళవారం జిల్లా వ్యాప్తంగా యూనివర్సిటీలు, కాలేజీల బంద్‌కు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. పీజీ ప్రవేశానికి ఉమ్మడి పీజీ సెట్ రద్దు చేసి, అడ్మిషన్ల నిర్వహణ బాధ్యతను యూనివర్సిటీలకే ప్రభుత్వం అప్పగించాలని మంగళవారం బంద్ నిర్వహించనున్నారు. ఈ బంద్‌ను జయప్రదం చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు బండి చలపతి పిలుపునిచ్చారు.

6న ఆర్‌సీరెడ్డి కాలేజీలో జాబ్‌మేళా

తిరుపతిరూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం పంచాయతీ విజయనగర్‌కాలనీలోని డాక్టర్ ఆర్‌సీరెడ్డి డిగ్రీ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఈ నెల 6న ఉదయం 8.30 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ డాక్టర్ పి.రవిచంద్రారెడ్డి పేర్కొ న్నారు. వివరాల కోసం 9074919939, 9988853335లను సంప్రదించాలని కోరారు.

● **ఐటీఐ కాలేజీలో ఉద్యోగ మేళా:** తిరుచానూరు రోడ్డు పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సబ్ ఎంప్లాయి మెంట్ ఆఫీస్ ఆధ్వర్యంలో ఈనెల 6న ఉదయం 10 గంటలకు ఉద్యోగమేళా నిర్వహి స్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎస్.వెంక టరమణ పేర్కొన్నారు. వివరాల కోసం 9392275861ను సంప్రదించాలని కోరారు.

పోలీసులకు సన్మానం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉద్యోగ విరమణ పొందిన నలుగురు పోలీసులను ఎస్పీ హర్షవర్ధన రాజు సోమవారం ఘనంగా సన్మానించారు. పోలీసు అతిథి గృహంలో పోలీసు అధికారుల యూనియన్ తరఫున సిబ్బంది, కుటుంబ సభ్యుల సమక్షంలో సన్మానించి వీడ్కోలు పలికారు. ఇందులో ఎస్బీ నుంచి ఎత్తిరాజులు, సాయుధ దళం నుంచి ఆర్ఎస్ఐ కె.లక్ష్మీపతి, బీఎన్ కండ్రిగ ఏఎస్ఐ శివకుమార్, ఈస్ట్ స్టేషన్ ఏఎస్ఐ గణేష్ బాబు ఉన్నారు.

జోరుగా టీటీడీ ఉద్యోగుల క్రీడా పోటీలు

తిరుపతి(క్రీడలు), మార్చి 3(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఉద్యోగుల క్రీడా పోటీలు జోరుగా జరుగుతున్నాయి. సోమవారం నిర్వహించిన బాల్ బాడ్మింటన్ సింగిల్ విభాగంలో నాదమునిపై చీర్ల కిరణ్ గెలుపొందారు. విశ్రాంత అధికారుల పురుషుల విభాగంలో షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్ పోటీల్లో నాగేశ్వరరావుపై సుధాకర్‌రావు విజయం సాధించారు. డబుల్స్‌లో మునికృష్ణయ్య, రవిప్రభాకర్ జట్టుపై నాగేశ్వరరావు, సుధాకర్ జట్టు విజేతగా నిలిచింది. మహిళల విభాగంలో షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో సుమతిపై లలితమ్మ విజయం సాధించారు. డబుల్స్‌లో భారతి, ప్రభావతమ్మ జట్టుపై లలితమ్మ, సుమతి జట్టు విజేతగా నిలిచింది. ప్రత్యేక ప్రతిభావంతుల విభాగంలో షటిల్ సింగిల్స్‌లో హరిప్రసాద్‌పై సునీల్‌కుమార్ విజయం సాధించారు. డబుల్స్‌లో హరిప్రసాద్, సాయిప్రసాద్ జట్టుపై సునీల్‌కుమార్, రెడ్డెప్ప జట్టు గెలుపొందింది.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

చంద్రగిరి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే పులివర్తి నాని అందించిన విద్యా సామగ్రిని టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు ఆధ్వర్యంలో అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు అందజేశారు.

రామచంద్రాపురం: మండలంలోని 360 మంది పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని మండల టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా నాయకులు జనార్దన చౌదరి, బిందుమాధవి, హరిప్రసాద్, సురేంద్రనాయుడు, గిరి, వెంకటప్రసాద్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరుపతి రూరల్: తుమ్మలగుంట జెడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సహకారంతో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బిరుదాల భాస్కర్‌రెడ్డి నేతృత్వంలో సోమవారం రైటింగ్ ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. విద్యా కమిటీ చైర్మన్ కమలమ్మ, వైస్ చైర్మన్ కార్తీక్, హెచ్ఎం భారతి, పంచాయతీ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, కేశవులుశెట్టి, తులసీరామిరెడ్డి, సిద్దురాయల్, రాధారాయల్, పద్మమ్మ, జయచంద్రారెడ్డి, సుబ్రమణ్యం, మనోహర్, వెంకటేష్‌నాయుడు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

రామచంద్రాపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దారు వెంకటరమణ అన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో పోలీసు, విద్య, రెవెన్యూశాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ భూముల్లో ఎక్కడ పడితే అక్కడ మట్టిని భారీ యంత్రాలతో అక్రమంగా తవ్వి తరలిస్తే క్రిమినల్ కేసులు పెట్టి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీ అన్వర్ బాషా, రీసర్వే డీటీ అమృత, సర్వేయర్ రమేష్‌బాబు, ఎంఈవో మార్కండేయనాయుడు, హౌసింగ్ ఏఈ మహేష్‌నాయుడు పాల్గొన్నారు.

తెలుగుభాషకు నిధులు హర్షణీయం

రామచంద్రాపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.10కోట్లు కేటాయించడం హర్షణీయమని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్షుడు దొడ్డ ఉమామహేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి జిల్లాకూ అధికార భాష అమలు కోసం ప్రత్యేక అధికారిని నియమించాలని కోరారు. ఇంటర్‌లో తెలుగును ఐచ్ఛికంగా కాకుండా తప్పనిసరి చేయాలని కోరారు.

పూరిల్లు దగ్ధం

రామచంద్రాపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలిజపల్లె దళితవాడకు చెందిన జ్ఞానమ్మ పూరిల్లు సోమవారం ఉదయం దగ్ధమైంది. బాధితురాలి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన జ్ఞానమ్మ తన పూరింట్లో సోమవారం గ్యాస్‌స్టౌ వెలిగించగా సిలిండర్ పేలి మంటలు ఎగిశాయి. తిరుపతి నుంచి అగ్నిమాపక యంత్రం వచ్చి మంటలను ఆర్పివేశారు. టీవీ, వస్తు సామగ్రి, రూ.1.30లక్షల నగదు, బంగారం కాలిపోయింది. ఆర్ఐ లక్ష్మీనారాయణ పరిశీలించారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

దెబ్బలు పడతాయ్ రో..!

● అలరించిన విరించి-2కె25 ఫ్లాష్ మాబ్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): దెబ్బలు పడతాయి రాజా.. దెబ్బలు పడతాయి రో.. అంటూ సాగిన విరించి-2కె25 ఫ్లాష్ మాబ్ ఆకట్టుకుంది. రంగు రంగుల వేషధారణలతో విద్యార్థులు పాటలకు నృత్యం చేస్తూ అందరినీ అలరించారు. ఈ నెల 12 వ తేదీ నుంచీ శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో రెండు రోజుల పాటు విరించి-2కె25 కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందిరా ప్రియదర్శినీ ఆడిటోరియంలో పలు ప్రతిభా, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఆ యూనివర్సిటీ పరిపాలనా భవనం ముందు సోమవారం ఇంజినీరింగ్ విద్యార్థినులు ఫ్లాష్‌మాబ్ చేపట్టారు. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెన్నం ఉమ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని, ఇంజినీరింగ్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మక, కళాత్మకతకు విరించి-2కె25 వేదిక అని, దీనిని అందరూ విజయవంతం చేయాలని కోరారు.

గోకులాలు పాడి రైతులకు వరం

భాకరాపేట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమం కోసం మంజూరు చేసిన మినీ గోకులాలు రైతులకు వరం లాంటివని టీడీపీ మండలాధ్యక్షుడు బెల్లంకొండ మురళి అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం దిగవూరు పంచాయతీలో మినీ గోకులాలను సోమవారం ఆయన ప్రారంభించారు. మండలానికి ఇప్పటికే 300పైగా గోకులం షెడ్లను ఎమ్మెల్యే పులివర్తి నాని మంజూరు చేయించారన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకుని తమ పశుసంపద కాపాడుకోవాలన్నారు. ఏపీవో భార్గవి, టీఏ రంజిత్ కుమార్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అక్కడికక్కడే 21 సమస్యలకు పరిష్కారం

● పోలీసు పీజీఆర్ఎస్‌కు 110 ఫిర్యాదులు



ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటున్న సీఐలు

తిరుపతి (నేరవిభాగం), మార్చి 3(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్పీ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వివిధ సమస్యలపై 110 అర్జీలు వచ్చాయి. వీటిలో 21 సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమానికి భారీ సంఖ్యలో అర్జీదారులు తరలి వచ్చారు. ఇంతదూరం వచ్చే వీరికి సత్వర న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో ఎస్పీ హర్షవర్ధనరాజు తొమ్మిది సబ్ డివిజన్ల నుంచి ఒక్కో సీఐను నియమించారు. ఆయా సబ్ డివిజన్ల పరిధిలోని అర్జీదారుల సమస్యలను సంబంధిత సీఐలు విని.. పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. ఇలా సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో అదనపు ఎస్పీలు నాగభూషణరావు, రవిమనోహరాచ్చారి, సీఐలు కూర్చుని వారివారి పరిధి నుంచి వచ్చిన అర్జీదారులతో మాట్లాడారు. 110 ఫిర్యాదుల్లో 21 అక్కడే పరిష్కరించారు. దివ్యాంగులు, వృద్ధుల సమస్యలపై అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు.

ఆప్కాస్ రద్దు చేస్తే ఆందోళన

తిరుపతి(ఆటోనగర్), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర హెచ్చరించారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం ఆప్కాస్ ఏర్పాటు చేసి కాంట్రాక్ట్ కార్మికులకు కొంత ఆధారం కల్పించిందని, అయితే కూటమి ప్రభుత్వం దాన్ని రద్దు చేసి కాంట్రాక్టర్లకు అప్పగించడానికి ప్రయత్నం చేయడం అన్యాయమన్నారు. ఆప్కాస్ రద్దు చేస్తే 1.20 లక్షల మంది కార్మికులకు ఉద్యోగ భద్రత ఉండదని, ప్రభుత్వ పెద్దలు పునరాలోచించాలని కోరారు.

కల్యాణకట్టలో సేవాభాగ్యం కల్పించండి

తిరుమల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకుని కల్యాణకట్టలో ఉచితంగా సేవలందించేందుకు తిరుపతిలోని నాయీబ్రాహ్మణులకు అవకాశం కల్పించాలని సోమవారం టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడికి నాయీబ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు సోమవారం వినతిపత్రం అందజేశారు. కాగా 2012 తర్వాత కల్యాణకట్టలో క్షురకులను నియమించలేదన్న అంశాన్ని వారు ఛైర్మన్ దృష్టికి తీసు కొచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నగర అధ్యక్షుడు సుధాకర్, జనసేన నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆవులపాటి బుచ్చిబాబు పాల్గొన్నారు.

ఎస్వీయూ లైబ్రరీలో పుస్తక ప్రదర్శన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీలో పుస్తక ప్రదర్శన ప్రారంభమైంది. రెండు రోజుల పాటు సాగే ఈ ప్రదర్శనను వీసీ ప్రొఫెసర్ అప్పారావు ప్రారంభించారు. అనంతరం పుస్తకాలను ఆయన పరిశీలించారు. వీసీ మాట్లాడుతూ పుస్తక పఠనం మంచి అలవాటన్నారు. పుస్తకాలు చదవడం ద్వారా సమాజం పట్ల అవగాహనతో పాటు బాధ్యత కూడా ఏర్పడుతుందన్నారు. లైబ్రరీ డైరెక్టర్ ప్రొఫెసర్ కొంగర సురేంద్రబాబు నాయుడు మాట్లాడారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగుల సమ్మెకు సీఐటీయూ మద్దతు

తిరుపతి(ఆటోనగర్), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈ నెల 24, 25 తేదీల్లో బ్యాంక్ ఉద్యోగులు తలపెట్టిన సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి తెలిపారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. జాతీయ బ్యాంక్‌లను సైతం వదలడం లేదన్నారు. బ్యాంకుల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంక్ ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మెకు మద్దతు ఇస్తున్నామని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

భక్తులకు దోమల బెడద లేకుండా..



శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు దోమల బెడదను తగ్గించేలా టీటీడీ హెల్త్ విభాగం సోమవారం ఫాగింగ్ చేసింది. శ్రీవారి ఆలయ మాడవీధులతో పాటు రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో హెల్త్ సిబ్బంది బ్యాటరీ వాహనాల ద్వారా ఫాగింగ్ చేశారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

వినతులను గడువులోపు పరిష్కరించండి

కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 280 అర్జీలు



వినతులు స్వీకరిస్తున్న డీఆర్వో నరసింహులు

ప్రజల నుంచి అందే ప్రతి అర్జీనీ గడువులోపు పరిష్కరించాలని డీఆర్వో నరసింహులు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్‌కు)కు 280 అర్జీలు అందగా అందులో 163 రెవెన్యూ శాఖకు సంబంధించి ఉన్నాయి. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోష్మాండ్ పాల్గొన్నారు. - తిరుపతి(కలెక్టరేట్)

ముస్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

జిల్లాలోని మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద కార్మికులు ధర్నా చేశారు. ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ రవి మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల వేతనాల చెల్లింపు, సాంఘిక భద్రత మున్సిపల్ శాఖే తీసుకోవాలన్నారు. ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించరాదని డిమాండ్ చేశారు. స్కూల్ స్వీపర్లు, వాచ్‌మెన్లను ఫుల్‌టైం వర్కర్లుగా గుర్తించి, కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. ఆప్కాస్‌ను కొనసాగించాలని కోరారు. ఏఐటీయూసీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు వైఎస్ మణి, శివ, రాజా, జాన్, దొరస్వామి, మదనమోహన్, ఇందుమతి పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లను కాపాడాలని ధర్నా

చింతలచేనుకు చెందిన తాళపాక దాము, అతని అనుచరుల నుంచి ఆటోడ్రైవర్లను కాపాడాలని సీఐటీయూ నేతలు సుబ్రహ్మణ్యం, వేణుగోపాల్ కోరారు. ఈ మేరకు ఆటోడ్రైవర్లతో కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఆర్టీసీ బస్టాండు, జయశ్యామ్ థియేటర్ ప్రాంతాల్లోని ఆటోస్టాండ్ల నుంచి చాలామంది ఆటో డ్రైవర్లు ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో దాము, అతని అనుచరులు బెదిరింపులకు పాల్పడుతున్నారని, వారి నుంచి రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేతలు ఆర్.లక్ష్మి, బుజ్జి, ఆటోడ్రైవర్లు వెంకటరమణ, హరిబాబు, భాస్కర్, దాము, మాధవ్, వెంకటాచలపతి, భూపాల్ పాల్గొన్నారు.

నివాస ప్రాంతాల్లో మద్యం దుకాణం వద్దు



మద్యం దుకాణానికి అనుమతి ఇవ్వొద్దంటూ విన్నవిస్తున్న వామపక్ష నేతలు

సాయినగర్ నివాస ప్రాంతాల్లో మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో డీఆర్వో నరసింహులుకు వినతిపత్రం అందజేశారు. తిరుపతి రూరల్ సాయినగర్ పంచాయతీలో టీటీడీ, విశ్రాంత ఉద్యోగులు నివాసముంటున్నారని, ఇండియన్ బ్యాంకు, ఆస్పత్రి, మూడు పాఠశాలలు ఉన్న ప్రదేశంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం సరికాదని, వెంటనే అనుమతి రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చిన్నం పెంచులయ్య, రాధాకృష్ణ, విశ్వనాథ్, జనమాల గురవయ్య, రమణయ్య, ఆనంద్, ఎన్డీ రవి, వైఎస్ మణి, వెంకటేష్ పాల్గొన్నారు. కాగా, ఇదే విషయమై సాయినగర్ సర్పంచ్ డీవీ రమణ, అవిలాల సర్పంచ్ వెంకటరమణ డీఆర్వోకు వినతిపత్రం అందించారు.

మెస్ చార్జీలు పెంచాలి



బీసీ హాస్టళ్లలోని విద్యార్థులకు ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం నేతలు నాగేశ్వరరావు కోరారు. కాస్మోటిక్ చార్జీలు రూ.500 పెంచాలని డిమాండ్ చేశారు. బీసీ వసతిగృహాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

ప్రత్యేక ఆకర్షణగా సేంద్రియ కూరగాయల స్టాల్



సేంద్రియ కూరగాయలను వినియోగదారులకు అందిస్తున్న ఏవో ప్రసాద్‌రావు

రైతు సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సేంద్రియ కూరగాయల స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పీజీఆర్ఎస్‌కు వచ్చిన ప్రతి అర్జీదారుడూ కూరగాయలను కొనుగోలు చేశారు. జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయంపై పాఠశాల దశ నుంచే అవగాహన పెంచాలన్నారు.

ఆప్కాస్ రద్దును విరమించుకోవాలి



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నేత జయచంద్ర తదితరులు

ఆప్కాస్‌ను రద్దు చేయా లన్న నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నబాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో డీఆర్వోకు వినతి పత్రం అందజేశారు. ఆప్కాస్‌ను రద్దు చేయడం వల్ల 1.20 లక్షల మందికి నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆప్కాస్ యూనియన్ నాయకులు సుభహాన్, ప్రభాకర్‌రెడ్డి, రవి, అజయ్‌కుమార్ ఆయన వెంట ఉన్నారు.

వితంతు పింఛను ఇచ్చి ఆదుకోండి



అయ్యా! నా భర్త చనిపోయి సంవత్సరం కావస్తోంది. కుటుంబ పోషణ కష్టంగా మారింది. వయసు మీద పడటంతో కూలి పనులకు వెళ్లలేని పరిస్థితి. వితంతు పింఛను కోసం సంవత్సరం రోజులుగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. మీరైనా న్యాయం చేయండి.
- పుట్టమ్మ, కలవాయిపాడు, నాయుడుపేట మండలం

వృద్ధాశ్రమంలో అన్నదానం

తిరుపతి అర్బన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్ 25సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేశవాయన గుంటలోని జాస్మిన్ వృద్ధాశ్రయంలో అన్నదానం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు రఘురామిరెడ్డి, కార్యదర్శి తోట చక్రపాణి, సాబుద్దీన్, విజయభాస్కర్‌రెడ్డి, గోపీయాదవ్, ఉదయగిరి కృష్ణమూర్తి, బండి మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, వృద్ధాశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో కలెక్టరుకు చికిత్స

తిరుపతి(వైద్యం), మార్చి 3(ఆంధ్రజ్యోతి): కిడ్నీలో రాళ్లు ఉండటంతో సోమవారం స్విమ్స్‌లో అడ్మిట్ అయిన కలెక్టరు వెంకటేశ్వర్‌కు వైద్యులు చిన్నపాటి శస్త్ర చికిత్స చేసి, వెంటనే డిశ్చార్జి చేశారు. ఇటీవల ఆయన స్విమ్స్‌లో చేసుకున్న వైద్యపరీక్షల్లో కిడ్నీలో చిన్నపాటి రాళ్లు ఉన్నట్లు తేలింది. దీంతో సోమవారం స్విమ్స్‌లోని గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగంలో అడ్మిట్ అయ్యారు. ఆయనకు కోత, కుట్లు లేకుండా వైద్యులు చిన్నపాటి సర్జరీని చేశారు. సాయంత్రానికి కోలుకోవడంతో వైద్యులు ఆయన్ను డిశ్చార్జి చేశారు. ప్రస్తుతం ఆయనకు ఎటువంటి ఆరోగ్య ఇబ్బందులు లేవని స్విమ్స్ వైద్యులు తెలిపారు.

2,296 మంది మందుబాబులపై కేసులు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) నెల రోజుల వ్యవధిలో జిల్లాలో బహిరంగంగా మద్యం తాగుతున్న 2,296 మందిపై కేసులు నమోదు చేశారు. ఫిబ్రవరి 1 నుంచి 28వ తేదీ వరకు జిల్లా పరిధిలోని తొమ్మిది సబ్ డివిజన్ల పరిధిలో పోలీసులు తనిఖీ చేశారు. బహిరంగంగా మద్యం తాగుతున్న వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చారు. 94.5 కిలోల గంజాయిని సీజ్ చేశారు. 335 మంది రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. 333 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతుండగా కేసులు నమోదు చేశారు.

బంగారు గొలుసు అప్పగింత



తిరుమల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): భక్తులు గదిలో మర్చిపోయిన గొలుసును గుర్తించి అధికారుల ద్వారా తిరిగి భక్తులకు అందజేసి టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి తన నిజాయతీ చాటుకున్నాడు. విజయవాడకు చెందిన జయశ్రీ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చారు. సన్నిధానంలో 5 నెంబరు గదిని అద్దెకు పొందారు. శ్రీవారి దర్శనం అనంతరం సోమవారం గది ఖాళీ చేసే సమయంలో బంగారు గొలుసును మర్చిపోయి వెళ్లిపోయారు. గదిని శుభ్రపరిచేందుకు వెళ్లిన టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి నాగార్జున్ గొలుసును గుర్తించి, టీటీడీ రిసెప్షన్ అధికారులకు అందజేశాడు. గొలుసు పోయిందటూ వచ్చిన భక్తుల నుంచి వివరాలు సేకరించిన రిసెప్షన్ ఓఎస్డీ సత్రేనాయక్, అధికారులు తిరిగి అందజేశారు. అధికారులు, సిబ్బందికి భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. నిజాయతీ చాటిన ఉద్యోగిని రిసెప్షన్ అధికారులు పట్టువస్త్రంతో సత్కరించి అభినందనలు తెలిపారు.

ఓ వైసీపీ నేతకు 28 కరెంట్ మీటర్లా?

● పార్కు, కాలువల ఆక్రమణలపై దృష్టి పెట్టండి ● పీజీఆర్ఎస్‌లో కమిషనర్‌ను కోరిన డిప్యూటీ మేయర్



కమిషనర్ మౌర్య, డిప్యూటీ మేయర్లు మునికృష్ణ, ముద్ర నారాయణలకు మ్యాప్ చూపి వివరిస్తున్న స్థానికులు

తిరుపతి, మార్చి3(ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో ఓ వైసీపీ నేత పేరిట డీకేటీ ఇళ్లకు 28 కరెంట్ కనెక్షన్లు ఎలా వచ్చాయని, పన్నులు ఎలా వేస్తారని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ అధికారులను ప్రశ్నించారు. సోమవారం కమిషనర్ మౌర్య నేతృత్వంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో డిప్యూటీ మేయర్లు మునికృష్ణ, ముద్రనారాయణలు పాల్గొన్నారు. ఒకటో డివిజన్‌కు చెందిన టీడీపీ నాయకులు, శ్రీసాయి విష్ణు లేఅవుట్ అసోసియేషన్ ప్రతినిధులు పీజీఆర్ఎస్‌లో కమిషనర్‌ను కలిశారు. దీనిపై మునికృష్ణ స్పందిస్తూ.. కాలువలు, పార్కు స్థలాలు ఆక్రమణలు గురైనట్టు పార్టీ నేతలు తమ దృష్టికి తేవడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించానని చెప్పారు. తిరుమల శేషాచల కొండల నుంచి ప్రవహించే ప్రధాన నీటి కాలువలను, శ్రీసాయి విష్ణు లేఅవుట్ పార్కు స్థలాలను గత ప్రభుత్వంలో ఆక్రమణకు గురైనట్లు గుర్తించామన్నారు. కాలువ పోరంబోకు భూములను ఆక్రమించి రేకుల షెడ్డులను నిర్మించి మునిసిపల్ ఇంటి పన్నులు, అలాగే విద్యుత్ మీటర్‌లను ఎలా ఇచ్చారు? అని మునిసిపల్ అధికారులను అడిగారు. శ్రీసాయి విష్ణులే అవుట్ పెద్ద పార్కు మధ్యలో నుంచి పోయే కపిలతీర్థం పెద్ద కాలువను పూర్తిగా ఆక్రమించడంతో ఈ కాలువ కలిసే చెరువును కొందరు ఆక్రమణలకు గురిచేసి ఉన్నట్టు గుర్తించామన్నారు. దీనికి సంబంధించిన మ్యాప్‌ను స్థానికులు కమిషనర్‌కు చూపించారు. స్పందించిన మౌర్య బుధవారం ఆక్రమణలను పరిశీలించి, తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఫోన్ ద్వారా 52 మంది తమ సమస్యలు తెలుపగా, 18మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, డీసీపీ మహాపాత్ర తదితరులు పాల్గొన్నారు.

ఆ శ్మశానానికి దారొచ్చింది

అక్రమ నిర్మాణాన్ని తొలగించిన రెవెన్యూ అధికారులు



నిర్మాణాన్ని తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

తిరుపతి, మార్చి3(ఆంధ్రజ్యోతి) : కొరమేనుగుంట వాసులు వినియోగించే శ్మశానానికి ఎట్టకేలకు దారి వచ్చింది. శ్మశానాన్ని ఆక్రమించుకోవాలన్న దురుద్దేశంతో దారిలేకుండా కొందరు అక్రమార్కులు రేకుల షెడ్డును నిర్మించడంతో 'శ్మశానానికి దారేది?' శీర్షికన గత శుక్రవారం ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనంపై రెవెన్యూ అధికారులు స్పందించారు. అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి పరిశీలించి ప్రభుత్వ భూమిలోనే అక్రమ నిర్మాణం చేపట్టారని నిర్ధారించారు. ఆ మేరకు సిబ్బంది అక్రమ నిర్మాణాన్ని తొలగించి కొరమేనుగుంట వాసులకు దారి కల్పించారు. తిరుపతి అర్బన్ మండలం 53, 54 సర్వే నంబర్లలోని స్థలాన్ని ఎన్నో ఏళ్లుగా అక్కడి వారు శ్మశానం కోసం వినియోగిస్తున్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్డు రావడంతో విలువైన భూమిపై అక్రమార్కుల కన్నుపడింది. స్థానికులకు, అక్రమార్కులకు మధ్య ఘర్షణలు, పోలీసు కేసులు, ఫిర్యాదుల పరంపర కొనసాగింది. కొరమేనుగుంట వాసులు ప్రజాప్రతినిధులు, అధికారులు చుట్టూ తిరిగి విసిగిపోయారు. ఈ విషయాన్ని వారు ఆంధ్రజ్యోతి దృష్టికి తీసుకురావడం, వార్త ప్రచురించడంతో యంత్రాంగంలో కదలిక వచ్చింది.

ఆలిండియా పోస్టల్ క్యారమ్స్ టోర్నీ ప్రారంభం



క్రీడా పతాకాలను ఆవిష్కరిస్తున్న ఎస్వీయూ వీసీ అప్పారావు

తిరుపతి(క్రీడలు), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా 27వ పోస్టల్ క్యారమ్స్ టోర్నమెంట్ సోమవారం ఉదయం అట్టహాసంగా ప్రారంభమైంది. ఇందిరామైదానంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్వీయూ వీసీ అప్పారావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. క్రీడా పతాకాలను ఆవిష్కరించి, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. 108 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎక్కువ సమయం పనిచేసే ఏకైక ఉద్యోగి పోస్టుమాన్ అని గుర్తుచేశారు. నిరంతరం ఒత్తిడితో కూడిన విధులు నిర్వహిస్తున్న పోస్టల్ ఉద్యోగులకు క్రీడలు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ కె.ప్రకాష్, డైరెక్టర్లు కె.సంతోష్‌నేతా, కె.సతీష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, విజయవాడ రైల్వేమెయిల్ సర్వీసస్ కె.నాగేశ్వరరావుకు రెండుకాళ్లు లేకపోయినా వీల్‌చైర్‌లో టోర్నీలో ప్రాతినిధ్యం వహించి అందరి దృష్టిని ఆకర్షించారు.

గ్రామీణ యువతకు ఉపాధి శిక్షణ

తిరుపతి(వైద్యం), మార్చి 3(ఆంధ్రజ్యోతి): దీనదయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్యయోజన పథకం కింద గ్రామీణ నిరుద్యోగ యువతకు మూడు నెలల ఉచిత శిక్షణ, నూరు శాతం ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ఏటూబీ డీడీయూ-జీకేవై స్కిల్స్ అకాడమీ ప్రిన్సిపాల్ కొండ మురళీమోహన్ పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ పదో తరగతి పాసైన 18 నుంచి 30 ఏళ్ల లోపు గ్రామీణ ప్రాంత వాసులు మాత్రమే అర్హులని తెలిపారు. వీరికి కౌంటర్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, రెస్టారెంట్ క్యాపిటల్ కోర్సుల్లో మూడు నెలల ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు 9391810079కు సంప్రదించాలన్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి అర్బన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈనెల 14న జనసేన ఆవిర్భావ దినోత్సవానికి తిరుపతి పార్లమెంటు పరిధిలో 2వేలమందితో హాజరై విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన తన నివాసంలో ఏడు నియోజకవర్గాల ఇన్‌చార్జులతో సమావేశమయ్యారు. జనసమీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌ల ఆధ్వర్యంలో 300మంది చొప్పున సభకు తరలివెళ్లేందుకు సన్నాహాలు చేపట్టాలన్నారు. సమావేశంలో తిరుపతి పట్టణాధ్యక్షుడు రాజారెడ్డి, వినుత(శ్రీకాళహస్తి), లావణ్యకుమార్(సత్యవేడు), సురేష్‌నాయుడు(సర్వేపల్లి), మునిగిరీష్(గూడూరు), ప్రకాష్(వెంకటగిరి), మహబూబ్‌బాషా(సూళ్లూరుపేట), దేవర మనోహర్(చంద్రగిరి) రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యులు తమ్మినేని వెంకటేశ్వరరావు, ఆకేపాటి సుభాషిణి, హేమకుమార్, చంద్రబాబు, మధుబాబు, హరిశంకర్, ఆనంద్, విజయ్‌కుమార్, కృష్ణయ్య, ఆకుల వనజ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

చెట్టు నిండా పూత... కానరాని పిందె!




విరగ్గాసిన పూత - మంచుతో మాడిపోయిన పూత

వడమాలపేట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): అలస్యంగా వచ్చిన పూతతో ఒకింత ఆనందంతో ఉన్న రైతులు... ఆ పూత పిందెగా మార్పు చెందుతుందా అంటూ ఆందోళనలో ఉన్నారు. మండలంలో శ్రీ బొమ్మరాజుపురం పరిధిలో మూడు వేల ఏకరాలకు పైగా మామిడి తోటలున్నాయి. ఏ.ఎం.పురం, ఎస్వీ పురం, తిరుమణ్యం, సీతారామపురం, అప్పలాయగుంట, పత్తిపుత్తూరుల్లో మరో మూడే వేల ఎకరాల్లో తోటలున్నాయి. ఈ ఏడాది జనవరిలో కూడా వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో పూత ఆలస్యంగా వచ్చింది. రెండు సార్లు మందులు కొట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. మూడో సారి మందులు పిచికారి చేశారు. వాతావరణం కొంత అనుకూలించడంతో 80శాతానికి పైగా పూత వచ్చింది. అయితే మంచుతో పూత మగ్గిపోయింది. వచ్చిన పూత 50 శాతం నిలబడి పిందె వస్తే కొంత మేరకు రైతులు ఆశలు నేరివేరినట్టే. ఎండలు కాస్తే పిందె వచ్చే అవకాశం ఉంది. పిందెగా మారే దశలో రాలకుండా నిలబడాలంటే ప్లానోఫిక్స్ 500 లీటర్ల నీళ్లకు 100 మిల్లీ గ్రాముల మందు కలిసి పిచికారీ చేయాలని వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్ సూచిస్తున్నారు. పిందె బఠాని సైజు వచ్చినపుడు 2 శాతం యూరియా ద్రావణం పిచికారీ చేయాలని, పిందె దశలో నీటి తడి ఇచ్చుకుంటే పూత రాలకుండా నిలబడుతుందని చెప్పారు.

వన్య, వృక్ష జాతులను పరిరక్షించుకుందాం

పుత్తూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న వన్యప్రాణులు, విలువైన ఔషధ మొక్కలను పర్యావరణ పరిరక్షణ కింద కాపాడుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. కళాశాల జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ వన్యప్రాణి దినాన్ని నిర్వహించారు.అధ్యాపకులు సాంసంగ్‌రాజు, వెంకటకృష్ణయ్య, షర్మిల పాల్గొన్నారు.

వృద్ధ మహిళలే లక్ష్యం

- తాళాలు వేసిన ఇళ్లలో పట్టపగలే చోరీ
- ఇద్దరు నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ రవికుమార్

పుత్తూరు అర్బన్, మార్చి3(ఆంధ్రజ్యోతి): ఒంటరి మహిళలు, వృద్ధులను లక్ష్యం చేసుకుని దోపిడీలు, చోరీలకు పాల్పడుతున్న నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి పుత్తూరు, నారాయణవనంలో చోరీలకు సంబంధించిన నిందితుల అరెస్టు చూపారు. పుత్తూరు షాప్ స్ట్రీట్ ఎక్స్‌టెన్షన్‌లో నివాసం ఉంటున్న వృద్ధ మహిళ మెడలో బంగారు చైన్‌ను గత నెల 18వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో దోపిడీ చేశాడన్నారు. ఈ కేసులో నిందితుడు బాలకృష్ణను పోలీసులు సోమవారం అరెస్టు చేశారన్నారు. పుంగనూరు మండలం జువ్వలదిన్నెకి చెందిన బాలకృష్ణ పుత్తూరు పట్టణంలోని ఎన్జీవో కాలనీలో నివాసం ఉంటూ వ్యసనాలకు బానిసై దోపిడీలు, చోరీలకు పాల్పడుతున్నాడన్నారు. రూ.2.36 లక్షల విలువైన 32 గ్రాముల బంగారు చైన్ రికవరీ చేసినట్లు తెలిపారు. పుత్తూరు సీఐ సురేంద్రనాయుడికి, ఎస్ఐ ఓబయ్యకు క్యాష్ రివార్డును అందజేశారు.

పట్టపగలే చోరీలు...

నారాయణవనం పరిధిలో పట్టపగలే వేర్వేరు రోజుల్లో రెండు చోరీలకు పాల్పడిన నిందితుడు గోపాల్‌ను సోమవారం అరెస్టు చేశారు. గత నెల 1న నారాయణవనం మండలం జగనన్న కాలనీలోని నవీన్‌ప్రకాష్ నివాసంలో, నారాయణవనం పట్టణంలోని తేరు వీధిలో నివాసం ఉంటున్న అమరావతి నివాసంలో పట్టపగలే చోరీకి పాల్పడ్డాడు. బీరువా పగులగొట్టి రూ.45 వేలు, కమ్మలు, చెవి రింగులు, ఉంగరాలు, వెండి మొలతాడు తదితరాలను చోరీకి చేశాడు. అమరావతి నివాసంలో గత నెల 17వ తేదీ 16 గ్రాముల బంగారు నెక్లెస్, 24 గ్రాముల కమ్మలు, 40 గ్రాముల చైన్ , రూ.లక్ష చోరీ చేశాడు. నిందితుడి నుంచి 44 గ్రాముల నగలు, 120 గ్రాముల వెండి మొలతాడు, రూ.80 వేలను రికవరీ చేసినట్లు తెలిపారు. నిందితుల్ని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పుత్తూరు రూరల్ సీఐ రవీంద్ర, ఎస్ఐ రాజశేఖర్, క్రైం సిబ్బంది దాము, మోహన్, పీఎస్ సిబ్బంది ఏఎస్ఐ జయరాం నాయక్, భాస్కర్, శ్రీనాథ్, రాజేష్‌ను అభినందించారు. అందరికీ క్యాష్ రివార్డును అందజేశారు.

జోరుగా గంజాయి విక్రయాలు!

దారి తప్పుతున్న యువత

పుత్తూరు, మార్చి3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని విక్రయాలను జరుపుతుండడంతో పుత్తూరు పట్టణం గంజాయికి అడ్డాగా మారింది. పట్టణంలోని ఇంజనీరింగ్, ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ, ఇంటర్, ఎంబీఏ, ఎంసీఏ, లా, హోమియో వైద్య కళాశాల... ఇలా దాదాపు పది విద్యా సంస్థలున్నాయి. ఈ కళాశాలల్లో మూడో వంతు విద్యార్థులు పట్టణంలోనే ఉంటున్నారు. ఇక గంజాయిని పాత రైల్వే క్యాబిన్, కృష్ణానగర్ ఎక్స్‌టెన్షన్, కల్యాణపురం, ఆర్‌డిఎం గేటు ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. తల్లిదండ్రులకు దూరంగా ఇక్కడ హాస్టళ్లు, ఇతర కేంద్రాల్లో చదువుకుంటున్న పలువురు విద్యార్థులు గంజాయి మత్తులో జారుకుంటున్నారు సాయంత్రం పూట అరచేతులలో నలిపి ముక్కుపుటాలతో పీల్చడం... వంటి దృశ్యాలు ఆ నాలుగు ప్రాంతాల్లో కనిపిస్తుంటాయి. రైల్వే ట్రాక్‌కు తూర్పున చెరువు ఉండడం, జనసంచారం లేకపోవడంతో గుంపులుగా ట్రాక్‌పై కూర్చుని నిరాఘాటంగా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే ఓ డిగ్రీ విద్యార్థి రాత్రి 11 గంటలకు చెన్నై వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురుగా పట్టాల మధ్య నిలుచున్నాడు. ఇంజన్ డ్రైవర్ చాలా సేపు హారన్ కొట్టినా పక్కకు వెళ్లకపోవడంతో మృతి చెందాడు. ఈ విషయాన్ని ఇంజన్ డ్రైవర్ స్వయంగా రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆత్మహత్యగా కేసు నమోదు చేశారు. పట్టాల మధ్యలో రైలుకు అడ్డంగా నిలబడే ధైర్యం కేవలం గంజాయి మత్తులో వున్న వారికి మాత్రమే సాధ్యమని చెబుతున్నారు. అలాగే డిగ్రీ చదువుతున్న ఓ విద్యార్థి గంజాయికి బానిసై డబ్బుకోసం తల్లిదండ్రుల మీద తిరగబడడంతో ఇంటి ముందున్న విద్యుత్ స్తంభానికి కట్టి వేసి పోలీసుల సాయంతో చెన్నైలోని పునరావాస కేంద్రానికి తరలించి బాగు చేయించారు. పెన్షన్ల పంపిణీ సందర్భంగా ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మాట్లాడుతూ... గంజాయి విక్రయాలను కఠినంగా అణచి వేయాలని పోలీసులను ఆదేశించడం గమనార్హం.

ఆప్కాస్ కొనసాగించాలి: ఏఐటీయూసీ

పుత్తూరు టౌన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికులను ఆప్కాస్ లోనే కొనసాగించాలని సోమవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సహా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు మణి, పుత్తూరు గౌరవాధ్యక్షుడు మహేష్ డిమాండ్ చేశారు, సోమవారం తిరుపతి కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేస్తే మున్సిపల్ శాఖే ఆ సిబ్బంది బాధ్యత చూడాలని కోరారు. కనీస వేతనం రూ.35వేలు చెల్లించాలని, కార్మికుల వేతనాలు చెల్లింపు, పనులు అప్పగింత నిర్వహణ మున్సిపల్ శాఖకే అప్పగించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు ప్రభాకర్, బాలకృష్ణ, నాగభూషనం, కుమార్, వెంకటముని, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

ప్రజా విజ్ఞప్తులకు సత్వర పరిష్కారం

డక్కిలి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా విజ్ఞప్తులకు సత్వరం పరిష్కారం చూపుతామని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం డక్కిలి తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యాక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఎక్కువగా భూ సమస్యలు, పింఛన్లు మంజూరు చేయాలని అర్జీలు అందాయని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న రాణి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రియాంక, మండల సర్వేయర్ రాజగోపాల్, వీఆర్వోలు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



అర్జీలపై వీఆర్వోలకు సూచలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

మొక్కుబడిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పలు శాఖల అధికారుల డుమ్మా ● సంతకాలు చేసి వెళ్లిపోతున్న మరికొందరు

సూళ్లూరుపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సూళ్లూరుపేటలో మొక్కుబడిగా సాగుతోంది. పలుశాఖ అధికారులు డుమ్మా కొడుతుండగా, కొందరు మొక్కుబడిగా హాజరై సంతకాలు పెట్టి వెళ్లిపోతున్నారు. సోమవారం సూళ్లూరుపేట తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మండల పరిషత్, గృహ నిర్మాణ, విద్యుత్, శిశుసంక్షేమ, అర్‌డబ్ల్యూఎస్, సర్వేశాఖ అధికారులు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన శాఖలకు చెందిన అధికారులెవ్వరూ రాలేదు. ముఖ్యంగా ప్రజలతో నిరంతరం సంబంధాలుండే వ్యవసాయ, పశుసంవర్ధక, జలవనరులు, వైద్యం, ఆర్టీసీ, వన్యప్రాణి, విద్య తదితర శాఖల అధికారులు గ్రీవెన్స్‌లో పాల్గొనకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరగకుండా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారు. అక్కడే అన్ని శాఖల అధికారులు వినతిపత్రాలు స్వీకరించి సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా ప్రతివారం మండల కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అయితే పలుశాఖల అధికారులు మొక్కుబడిగా హాజరై సంతకాలు పెట్టి వెళ్లిపోవడం, కొందరు పూర్తి డుమ్మా కొడుతుండడంతో ప్రభుత్వ ఉద్దేశం నీరుగారిపోతోంది. దీనిపై తహసీల్దార్ నరసింహరావును వివరణ కోరగా అన్నిశాఖల అధికారులు గ్రీవెన్స్‌కు తప్పకుండా రావాలని, హాజరైన అధికారుల వివరాలు ఆర్డీవోకు పంపామన్నారు.

పెళ్లకూరు: మండలం కేంద్రమైన పెళ్లకూరు రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఎంపీడీవో, వ్యవసాయ, గృహ నిర్మాణం, వెలుగు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మాత్రమే హాజరయ్యారు. విద్యుత్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, ఉద్యానశాఖ, వైద్యం తదితర ముఖ్య శాఖలకు చెందిన అధికారులు రాకపోవడంతో సంబంధిత సమస్యలతో వచ్చిన ఫిర్యాదుదారులు నిరాశతో వెనుతిరగాల్సి వచ్చింది. ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అన్నిశాఖల అధికారులు హాజరయ్యేలా ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సూళ్లూరుపేట తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరైన ఆరుగురు అధికారులు

నిద్రమత్తు వల్లే తెల్లవారుజామున ప్రమాదాలు

డక్కిలి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్లీ పోలీస్ కార్యక్రమంలో భాగంగా డక్కిలి పోలీసులు తెల్లవారుజామున వాహనాలు నడిపే డ్రైవర్లకు ఫేష్ వాషింగ్ కార్యక్రమం చేపట్టారు. ఏర్పేడు - పెంచలకోన నడుమ జాతీయ రహదారిలో తిరిగే లారీలను ఆపి పోలీసులు డ్రైవర్లకు వాటర్ బాటిళ్లు అందజేసి ఫేష్ వాషింగ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జాతీయ రహదారిపై ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరుగు తుండడంతో పోలీసులు నివారణ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం తెల్లవారుజామున లారీ డ్రైవర్లకు వాటర్ బాటిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివశంకర్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ లారీ డ్రైవర్లు రాత్రంతా వాహనాలు నడపడం వల్ల తెల్లవారుజామున నిద్రలోకి జారుకొంటుండడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. నిద్రవస్తే రోడ్డు పక్కన ఆపి కొంతసేపు విశ్రాంతి తీసుకుని వాహనం నడపాలని డ్రైవర్లకు సూచించారు.



లారీ డ్రైవర్ ముఖం కడుక్కోడానికి నీళ్లు అందిస్తున్న ఎస్ఐ శివశంకర్ గౌడ్

తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.102 కోట్ల మంజూరు

గూడూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా శాశ్వతంగా పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం ద్వారా రూ.102 కోట్లు మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పట్టణానికి కండలేరు జలాశయం నుంచి పైపులైన్ల ద్వారా తాగునీటి సరఫరా జరుగుతోందన్నారు. ఈ పైపులు తరచూ లీకేజీల కారణంగా మరమ్మతులకు గురవుతుండడంతో నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తేవన్నారు. ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా కేంద్రాన్ని సంప్రదించి అమృత్ పథకం కింద ప్రస్తుతం ఉన్న జీఆర్‌పీ(గ్లాస్ రీ ఇన్‌ఫోర్స్‌డ్ ప్లాస్టిక్) పైప్‌లైన్ల స్థానంలో డీఐ(డక్ టైల్ ఐరన్) పైపులైన్లు అమర్చేందుకు రూ.102 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధుల విడుదలకు కృషి చేసిన సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఎమ్మెల్యే పాశం కృతజ్ఞతలు తెలిపారు.

పరిహారం రైతులకే ఇవ్వాలి



ఆర్డీవో కిరణ్మయికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు అల్లెయ్య, పద్మనాభం, జనార్దన్ తదితరులు

సూళ్లూరుపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ పారిశ్రామికవాడ భూసేకరణలో పట్టాదారులైన రైతులకే పరిహారం ఇవ్వాలని సీపీఎం నాయకులు సోమవారం ఆర్డీవో కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నేత జనార్దన్ మాట్లాడుతూ సత్యవేడు మండలం ఇరుగలం, కొల్లడం, పెద్దఈటిపాకం, చిన్నఈటిపాకం గ్రామాల్లో చేస్తున్న భూసేకరణలో పొరపాట్లు ఉన్నాయని, వాటిని పరిశీలించి పట్టాదారులైన రైతులకే పరిహారం ఇవ్వాలన్నారు. అదే విధంగా బీఎన్‌కండ్రిక౦డ్రిగ మండలం కుక్కంబాకం గ్రామంలో సర్వే నెం.81లో ఉన్న ప్రభుత్వ భూమిని 40మంది దళితులు పది సంవత్సరాల పైబడి సాగు చేసుకొంటున్నారని, వారికి పట్టాలు ఇవ్వాలని ఆర్డీవోకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అల్లెయ్య, పద్మనాభయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు మంజూరు చేయాలి

సూళ్లూరుపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరికీ కొత్త పింఛన్లు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు మున్సిపల్ కమిషనర్ చిన్నయ్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి ఆనంద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొత్త పింఛన్లు ఇవ్వాలని చేయాలని ఇప్పటికే పలుసార్లు సచివాలయాల్లో అర్జీలు ఇచ్చినా మంజూరు కాలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వేలు, వెంకటేశ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మోటర్ సైకిల్‌ను ఢీకొన్న ట్రాక్టర్: ఒకరి మృతి



మృతి చెందిన మారయ్య

చిట్టమూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బయ్యావారికండ్రిగ రోడ్డు వద్ద సోమవారం రాత్రి మోటర్ సైకిల్‌ను ట్రాక్టర్ ఢీకొనడంతో కనుబోయిన మారయ్య(38) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... కుమ్మరిపాళెం గ్రామానికి చెందిన మారయ్య భార్య బిడ్డలతో కలిసి మన్నెమాల గ్రామంలోని అత్తగారి ఇంట్లో నివాసం ఉంటున్నాడు. సోమ వారం మోటార్ సైకిల్‌పై కొత్త గుంటకు వచ్చి మన్నెమాలకు తిరిగి వెళ్తుండగా బయ్యావారికండ్రిగ వద్ద ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మారయ్యను 108 వహనంలో నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిన్న బలరామయ్య తెలిపారు.

డాక్టర్ రమణయ్యకు ప్రముఖుల నివాళి



డాక్టర్ రమణయ్య కుటుబంస సభ్యులను పరామర్శిస్తున్న డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు, విశ్రాంత ఉద్యోగులు

నాయుడుపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ కేవీ రమణయ్యకు పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. ఆదివారం అనారోగ్యంతో రమణయ్య మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన స్వగ్రామమైన నాయుడుపేట మండలం బిరదవాడలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. నాయుడుపేట డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ గోపినాథ్, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ ఆదవరపు సందీప్, డాక్టర్ క్రాంతికుమార్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ రామసుబ్బయ్య, విశ్రాంత ఉద్యోగుల నాయకులు ఉమాశంకర్, పేర్నాటి వెంకటేశ్వర్లు, చిగురువాడ పద్మనాభం, హెచ్ సుబ్రహ్మణ్యం, కాలేషా, నారాయణ పాఠశాల ఏవో గౌస్‌బాషా, ప్రిన్సిపాల్ మల్లిఖార్జున తదితరులు నివాళులర్పించారు.

డక్కిలి పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌస్



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివశంకర్ గౌడ్

డక్కిలి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా డక్కిలి పోలీసు స్టేషన్‌లో సోమవారం ఓపెన్‌హౌస్ నిర్వహించారు. పోలీసు స్టేషన్ సందర్శన కోసం వచ్చిన డక్కిలి బాలికల గురుకుల కళాశాల విద్యార్థులకు పోలీసులు వినియోగించే ఆయుధాలు, వాటి పనితీరు గురించి ఎస్ఐ శివశంకర్ గౌడ్ వివరించారు. పోలీసుల విధులు, చట్టాలపై అవగాహన కల్పించారు. స్టేషన్‌లో ఫిర్యాదులు స్వీకరించే చాంబర్, లాకప్ రూంను విద్యార్థులు పరిశీలించారు. ఎవరైనా వేధింపులకు పాల్పడినా, ప్రమాదాలు సంభవించినా విద్యార్థులు భయపడకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సూచించారు.

తడి, పొడి చెత్తతో సంపద



యల్లసిరి గ్రామంలో చెత్త సేకరిస్తున్న అధికారులు

చిట్టమూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): చెత్తతో సంపద సృష్టించేందుకు చర్యలు చపట్టినట్లు ఎంపీడీవో మనోహర్ గౌడ్ తెలి పారు. సోమవారం యల్లసిరి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పారిశుధ్య కార్మికులు చెత్త సేకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడు తూ మండలంలో ఉన్న డంపింగ్ యార్డుల్లో తడి, పొడి చెత్త వేరు చేసి సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమం లో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జనార్దన్, కార్యదర్శి ధనలక్ష్మి పాల్గొన్నారు.

జనసేన ప్లీనరీకి జనసమీకరణపై చర్చ



ప్రకాష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆరణి

వెంకటగిరి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును వెంకటగిరి జనసేన నాయకుడు జంపాల ప్రకాష్ సోమవారం కలిశారు. ఈనెల 14న పిఠాపురంలో జనసేన పార్టీ ప్లీనరీ సభ నిర్వహించనున్నారు. ఈ సభను విజయవంతం చేసే చేపట్టాల్సిన కార్యాచరణపై వెంకటగిరి నియోజకవర్గ నేతలతో సోమవారం తిరుపతిలో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ఆరణిని కలిసిన ప్రకాష్ నియోజకవర్గంలో జనసేన పరిస్థితిని వివరించారు. జనసేన ప్లీనరీకి వెంకటగిరి నుంచి జన సమీకరణ బాధ్యతను ప్రకాష్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌ను ఎమ్మెల్యే ఆరణి సన్మానించారు.

ప్రశాంతంగా ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు



పరీక్షా కేంద్రంలో విద్యార్థులు

గూడూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని డీఆర్ డబ్ల్యూ, నారాయణ, స్వరాంధ్ర భారతి, సెయింట్ మేరీస్, ఎస్‌కేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉదయం 9నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు.

క్రీడాకారులకు అభినందన

కోట మార్చి 3(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులను ఆ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి సోమవారం అభినందించారు. గత నెల 28 నుంచి ఈనెల 1వ తేదీ వరకు నెల్లూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయస్థాయి క్రీడా పోటీలు జరిగాయి. ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన చందు కబడ్డీ, టేబుల్ టెన్నిస్‌లో ప్రథమ స్థానం, మహిళా విభాగం టేబుల్ టెన్నిస్‌లో చందన ద్వితీయ స్థానం సాధించారు. అయా క్రీడాకారులను డైరెక్టర్ విజయకుమార్ రెడ్డి ,ఫిజికల్ డైరెక్టర్ మల్లికార్జున్ రెడ్డిలు షీల్డ్‌లు, మెమెంటోలతో వారిని అభినందించారు.

బంగారు గొలుసు అప్పగింత

తిరుమల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): భక్తులు గదిలో మర్చిపోయిన గొలుసును గుర్తించి అధికారుల ద్వారా తిరిగి భక్తులకు అందజేసి టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి తన నిజాయతీ చాటుకున్నాడు. విజయవాడకు చెందిన జయశ్రీ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చారు. సన్నిధానంలో 5 నెంబరు గదిని అద్దెకు పొందారు. శ్రీవారి దర్శనం అనంతరం సోమవారం గది ఖాళీ చేసే సమయంలో బంగారు గొలుసును మర్చిపోయి వెళ్లిపోయారు. గదిని శుభ్రపరిచేందుకు వెళ్లిన టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి నాగార్జున్ గొలుసును గుర్తించి, టీటీడీ రిసెప్షన్ అధికారులకు అందజేశాడు. గొలుసు పోయిందటూ వచ్చిన భక్తుల నుంచి వివరాలు సేకరించిన రిసెప్షన్ ఓఎస్డీ సత్రేనాయక్, అధికారులు తిరిగి అందజేశారు. అధికారులు, సిబ్బందికి భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. నిజాయతీ చాటిన ఉద్యోగిని రిసెప్షన్ అధికారులు పట్టువస్త్రంతో సత్కరించి అభినందనలు తెలిపారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

పెళ్లకూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ నాగరాజు హెచ్చరించారు. సోమవారం రాత్రి మండలంలోని చెంబేడు గ్రామంలో బెల్ట్ షాపుపై పోలీసులు దాడి చేశారు. 8 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, బెల్ట్ షాపు నిర్వాహకుడు రమణయ్యను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

స్విమ్స్‌లో కలెక్టరుకు చికిత్స

తిరుపతి(వైద్యం), మార్చి 3(ఆంధ్రజ్యోతి): కిడ్నీలో రాళ్లు ఉండటంతో సోమవారం స్విమ్స్‌లో అడ్మిట్ అయిన కలెక్టరు వెంకటేశ్వర్‌కు వైద్యులు చిన్నపాటి శస్త్ర చికిత్స చేసి, వెంటనే డిశ్చార్జి చేశారు. ఇటీవల ఆయన స్విమ్స్‌లో చేసుకున్న వైద్యపరీక్షల్లో కిడ్నీలో చిన్నపాటి రాళ్లు ఉన్నట్లు తేలింది. దీంతో సోమవారం స్విమ్స్‌లోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో అడ్మిట్ అయ్యారు. ఆయనకు కోత, కుట్లు లేకుండా వైద్యులు చిన్నపాటి సర్జరీని చేశారు. సాయంత్రానికి కోలు కోవడంతో వైద్యులు ఆయన్ను డిశ్చార్జి చేశారు. ప్రస్తుతం ఆయనకు ఎటువంటి ఆరోగ్య ఇబ్బందులు లేవని స్విమ్స్ వైద్యులు తెలిపారు.

గ్రామీణ యువతకు ఉపాధి శిక్షణ

తిరుపతి(వైద్యం), మార్చి 3(ఆంధ్రజ్యోతి): దీనదయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్యయోజన పథకం కింద గ్రామీణ నిరుద్యోగ యువతకు మూడు నెలల ఉచిత శిక్షణ, నూరు శాతం ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ఏటూబీ డీడీయూ-జీకేవై స్కిల్స్ అకాడమీ ప్రిన్సిపాల్ కొండ మురళీమోహన్ పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ పదో తరగతి పాసైన 18 నుంచి 30 ఏళ్ల లోపు గ్రామీణ ప్రాంత వాసులు మాత్రమే అర్హులని తెలిపారు. వీరికి కౌంటర్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, రెస్టారెంట్ క్యాపిటల్ కోర్సుల్లో మూడు నెలల ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు 9391810079కు సంప్రదించాలన్నారు.

అర్జీల స్వీకరణ

వెంకటగిరి టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 8వ వార్డు సచివాయంలో కౌన్సి లర్ ఆరి శంకరయ్య ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు.

ఆప్కాస్‌ను రద్దు చేస్తే ఆందోళన

తిరుపతి(ఆటోనగర్), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్ రద్దు నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర హెచ్చరించారు. ఆప్కాస్ రద్దు చేస్తే 1.20 లక్షల మంది కార్మికులకు ఉద్యోగ భద్రత ఉండదని, ప్రభుత్వ పెద్దలు పునరాలోచించాలని కోరారు.

విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(ఆటోనగర్), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం తిరుపతి జిల్లా పరిధిలో గృహ విద్యుత్ వినియోగదారుల సౌలభ్యం కోసం అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఈ పి.సురేంద్రనాయుడు కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ) 50 శాతం రాయితీ కల్పిస్తుందని తెలిపారు. మంగళవారం నుంచి జూన్ 30 వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఇంటి సర్వీసు తీసుకుంటున్న సమయంలో అంగీకరించిన లోడ్ కంటే, ఎక్కువ లోడ్ వినియోగిస్తున్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని తహసీల్దారు సుబ్రహ్మణ్యం అధికారులను ఆదేశించారు. తహసీల్దారు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ కార్యక్రమంలో వచ్చిన వినతులను విచారించి తక్షణమే పరిష్కరించాలన్నారు. భూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. దీర్ఘకాలిక భూ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే విచారించి న్యాయం చేస్తామన్నారు. మండలంలో ఇంటి స్థలాలు లేని వారిని గుర్తించి నివేదిక తయారు చేయాలన్నారు. ఎంపీడీవో త్రివిక్రమరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వింధ్య, ఏపీవో భానుప్రియ, ఏవో భారతి, ఆర్ఐ మీరయ్య, ఎంఈవో మునిసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కరిరాజుపై వేంకటేశ్వరుడి అభయం



శ్రీకాళహస్తి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండమానుపురంలో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న అభయహస్త వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు గజ వాహనంపై గ్రామంలో విహరించారు. ఉదయం స్వామిఅమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ జరిగింది. రాత్రి సర్వాలంకార శోభితుడైన స్వామివారు గజ వాహనంపై ఆశీనులై గ్రామవీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వలస కార్మికుడి మృతి

శ్రీకాళహస్తి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వలస కార్మికుడు మృతి చెందాడు. ఉత్తర భారతదేశానికి చెందిన బాబుల్ సర్కార్ (41) శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని వీఎంపల్లి వద్ద ఉన్న ఓ ప్రైవేటు రోడ్డు నిర్మాణ సంస్థలో కార్మికుడు. ఇటీవల స్వగ్రామానికి వెళ్లి తిరిగి సోమవారం సాయంత్రం వీఎంపల్లి వద్ద బస్సు దిగాడు. ఈ క్రమంలో పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిపై వీఎంపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీకాళహస్తి 2వ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. హిట్ అండ రన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

ట్రాక్టర్‌నుంచి జారిపడి కూలీ దుర్మరణం

శ్రీకాళహస్తి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ నుంచి జారిపడి కూలీ దుర్మరణం చెందాడు. ఏర్పేడు మండలం ముసలిపేడుకు చెందిన కన్నయ్య(48) కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. మూర్ఛవ్యాధి ఉండటంతో అప్పుడప్పుడు అపస్మారకస్థితిలోకి వెళ్లి అస్వస్థతకు గురయ్యేవాడు. సోమవారం సమీప బంధువులకు చెందిన ట్రాక్టర్ శ్రీకాళహస్తి మండలం రామాపురంలో గడ్డి లోడు కోసం వెళ్లింది. ఈ ట్రాక్టరుతో పాటు సహాయంగా కన్నయ్య వెళ్లాడు. రామాపురం నుంచి ట్రాక్టరు గడ్డిలోడుతో ముసలిపేడుకు బయలుదేరింది. ట్రాక్టరులో చెక్కపై కూర్చుని ఉన్న కన్నయ్యకు మూర్ఛ రావడంతో కిందకు జారిపడ్డాడు. ఈ క్రమంలో వెనుక ట్రక్కు చక్రం కింద పడటంతో దుర్మరణం చెందాడు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రి మార్చ్యురీకి తరలించారు.

పంటలకు చీడపీడలు... ఆందోళనలో రైతులు



వేరుశనగ పంటకు క్రిమి సంహారక మందు పిచికారీ



మినుములో ఆకుముడత పురుగు - వరికి సోకిన తెల్ల పురుగు

కేవీబీపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేరుశనగ, మినుము, వరికి చీడపీడలు ఆశించాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని చోట్ల వరి చేతికొచ్చే సమయంలో తెల్లపురుగు ఆశించి పంటను నాశనం చేసి ఎదగనివ్వకుండా కాండాన్ని తెంచి వేస్తున్నాయి. అలాగే మినుముకు ఆకుముడత పురుగు ఆశ్రయించి కోత, పిందె సమయంలో ఆకులు, పూతను తినివేస్తోంది. ఇక వేరుశనగకు లద్దెపురుగు ఆశించి కాండాన్ని, ఆకులను తుంచి వేస్తున్నాయి. దీంతో రైతులు వ్యవసాయాధికారులను ఆశ్రయించి తగిన మోతుదులో కీటక నాశిని మందులను పిచికారీ చేశారు. అయినా కూడా పురుగులు చావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సారా దుష్పలితాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లావణ్య

కేవీబీపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగయ్యగుంటలో సారా దుష్ఫలితాలపై శ్రీకాళహస్తి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆధ్వర్యంలో నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహించారు. సారా తయారీని అరికట్టడానికే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సారా తయారీ, విక్రయం చట్టరీత్యా నేరమన్నారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, సబ్‌ఇన్‌స్పెక్టర్లు నిరంజన్‌రెడ్డి, లావణ్య, సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పర్యవేక్షణ

వరదయ్యపాళెం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలం కడూరు పంచాయతీలో సోమవారం సర్పంచ్ సుజాత శ్రీనివాసులు, కార్యదర్శి, ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ చిరంజీవి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు.

నీరువాయి దాహం తీరింది



పిచ్చాటూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న నీరువాయిలో నెలకొన్న తాగునీటి కొరతను తీర్చడానికి సోమవారం సర్పంచు సుగ్రీవ ఆధ్వర్యంలో బోరుని డ్రిల్ చేశారు. ఎమ్మెల్యే ఆదమూలం చొరవతో నీరువాయి దాహం తీరిందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన నేత సుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ముఖద్వారం బోర్డు

నారాయణవనం, మార్చి 3(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలో ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న కైలాసనాథ కోన ముఖద్వారం ప్రమాదకర పరిస్థితుల్లో ఉంది. చాలా ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ముఖద్వారం తుప్పు పట్టింది. ఆ బోర్డు ఎక్కడ భక్తులపై పడుతుందోనని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. అత్యంత అహ్లాదకరంగా ఉంటున్న కైలాసనాథ కోన ముఖద్వారం బోర్డుకు పెయింటింగ్ కూడా కొట్టలేదని భక్తులు వాపోతున్నారు. ఇప్పటికైన ఆలయ నిర్వాహకులు ముఖద్వార బోర్డును సరిచేయాలని భక్తులు కోరుతున్నారు.

రేపు వేదపారాయణం

శ్రీకాళహస్తి,మార్చి 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద బుధవారం ఉదయం 9 నుంచి 12గంటల వరకు వేద పారాయణం చేస్తారని ఈవో బాపిరెడ్డి తెలిపారు. ధూర్జటి కళాప్రాంగణంలో సాయంత్రం 3.30గంటలకు వేదపండితుల ఆశీర్వాద స్వస్తి, పండితులకు సత్కారం జరుగుతుందని తెలిపారు.

వైభవంగా కేడిగ వాహన సేవ



కేడిగ వాహన సందర్భంగా యాగశాల పూజలు - పురవీధుల ఉత్సవానికి బయలుదేరుతున్న స్వామిఅమ్మవార్లు

శ్రీకాళహస్తి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని 11వ రోజైన సోమవారం ఉదయం స్వామి అమ్మవార్లకు కేడిగ వాహన సేవ వైభవంగా నిర్వహించారు. మొదట అలంకార మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం కేడిగ వాహనంపై అధిష్టింపజేసి పురవీధుల్లో ఊరేగించారు. వాహన సేవలో భక్తులు బారి కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఈవో బాపిరెడ్డి, బీజేపీ నాయకుడు కోలా ఆనంద్, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పల్లకీసేవ మహోత్సవం...

అద్దంలో అమ్మవారి దర్శనం

మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో నిర్వహించే పల్లకీసేవ ఉత్సవానికి ఎంతో వైశిష్ట్యం ఉంది. కల్యాణోత్సవ సమయంలో గంగాదేవిని వివాహమాడిన విషయాన్ని పమరశివుడు గోప్యంగా ఉంచడంపై అమ్మవారు అలక భూనుతుంది. ఆపై ఆగ్రహంతో పల్లకీలో వెళ్లిపోతారు. వెనుక మరో పల్లకీలో జగదాంబను బుజ్జగిస్తూ సర్వేశ్వరుడు వెంబడించడం ఈ పల్లకీ సేవ పరమార్థం. ఈఉత్సవాన్ని పురస్కరించుకుని కోపంగా ఉన్న ఆదిశక్తిని అద్దం ద్వారా చూసి భక్తులు దర్శించుకుంటారు.

పీవీ రోడ్డులో ట్రాఫిక్ నరకం



పీవీ రోడ్డులో రాకపోకలు స్తంభించడంతో బారులు తీరిన వాహనాలు



రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

శ్రీకాళహస్తి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీవీరోడ్డులో ట్రాఫిక్ సమస్య వాహనదారులకు నరకాన్ని తలపిస్తోంది. పట్టణంలో ట్రాఫిక్ సమస్య చాలా సంవత్సరాలుగా ప్రజలను వేధిస్తున్న విషయం తెలిసిందే. అందులోను ప్రత్యేకించి పీవీరోడ్డులో తీవ్రస్థాయిలో ఉంది. అగ్నిమాపక కూడలి నుంచి వీఎంసీ సర్కిల్ వరకు ఉన్న పీవీరోడ్డులో ఆర్టీసీ బస్టాండు కూడా ఉంది. దీంతో ఈ ప్రాంతం నిత్యం భారీ వాహనాలతో స్తంభించిపోతోంది. ఈ రోడ్డును విస్తరించక పోవడంతోనే ఈ సమస్య తలెత్తుతోంది. 2014-19 మధ్యలో టీడీపీ ప్రభుత్వ హయాంలో బసవయ్యపాళెం నుంచి తెట్టు కూడలి వరకు రోడ్డును విస్తరించి డివైడర్ నిర్మించారు. దాంతో అక్కడ ట్రాఫిక్ సమస్య తీరింది. తెట్టు నుంచి శీతాలంబ కూడలి, అక్కడి నుంచి కొత్తపేట, అగ్నిమాపక కేంద్రం వరకు ఉన్న రోడ్డు పట్టణంలోనే అత్యంత ఇరుకుగా కొనసాగుతోంది. అదే తరహాలో అగ్నిమాపక కూడలి నుంచి ఆర్టీసీ బస్టాండు అక్కడి నుంచి వీఎంసీ సర్కిల్ వరకు కూడా రోడ్డు ఇరుకుగా ఉంది. మొత్తంగా తెట్టు నుంచి వీఎంసీ కూడలి వరకు రోడ్డును విస్తరించాల్సిన అవసరం ఉంది. పీవీరోడ్డులోని ఆర్టీసీ బస్టాండు నలువైపులా పెద్ద వ్యాపార సంస్థలున్నాయి. దీంతో వాహనాలు ఎక్కడికక్కడు నిలిచిపోతూ ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సోమవారం పీవీరోడ్డులో మధ్యాహ్నం 12 నుంచి సుమారు రెండు గంటల పాటు వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఇకనైనా పాలకులు, అధికారులు స్పందించి పట్టణంలో రోడ్ల విస్తరణపై దృష్టి సారించాల్సి ఉంది.

యథేచ్ఛగా అక్రమ కట్టడాలు... చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు



అక్రమం నిర్మాణం - తవ్వి పడేసిన విద్యుత్ స్తంభం



వరదయ్యపాళెం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపాండూరు పంచాయతీ వీకే ఆర్‌నై కాలనీలో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు సాగుతున్నాయి. అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. వీకేఆర్‌నై కాలనీ శ్రీసిటీకి, ఏపీఐఐసీ పరిశ్రమలకు కూత వేటు దూరంలో ఉండటంతో భూములకు గిరాకీ పెరిగింది. ఇదే అదనుగా భావించి కొందరు ఇక్కడ ప్రభుత్వ భూమి సహా ఆర్ అండ్ బీ రోడ్డును ఆక్రమించి అనధికారికంగా నిర్మాణాలు చేపట్టారు. విద్యుత్ స్తంభాలను తొలగించి నిర్మిస్తున్నారంటే ప్రభుత్వ యంత్రాంగా ఏమి చేస్తుందో అని ప్రజలు అనుకుంటున్నారు. ఓ ఎంపీటీసీ సభ్యుడి కనుసన్నల్లో ఈ వ్యవహారం నడుస్తున్నట్టు చెబుతున్నారు. ఇకనైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది.

ఇంటి పట్టాలు మంజూరు చేయండి



నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

వరదయ్యపాళెం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): తమకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని మండలంలోని చిన్నపాండూరు సమీపంలోని నక్కలమిట్ట కాలనీవాసులు సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద డీసీసీ అధ్యక్షుడు బాలగురవం బాబుతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 15 సంవత్సరాలుగా నక్కలమిట్ట కాలనీలో వీరు స్థిర నివాసం ఉంటున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. వారు ఉండే నివాసాలకు పట్టాలు మంజూరు చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): తమకు ఇంటి స్థలాలు ఇవ్వాలని మండలంలోని కనమనంబేడువాసులు తహసీల్దారు సుబ్రహ్మణ్యంకు విన్నవించారు. సర్వే నెం.253 లో ఉన్న ప్రభుత్వ భూమిలో స్థలాలివ్వాలని కోరారు. రికార్డులు పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

బాల్య వివాహాలతో అనర్థం

నారాయణవనం, మార్చి 3(ఆంధ్ర జ్యోతి): బాల్య వివాహాలతో భవిష్యత్తు అనర్థాలకు దారి తీస్తుందని సీడీపీవో శోభారాణి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ పిచ్చాటూరు ప్రాజెక్టు తరుపున బాల్య వివాహాల నిర్మూలన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలతో శరీరంలో జరిగే మార్పులు, సమస్యలపై అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థినులు ఆత్మరక్షణ కోసం అవలంబించాల్సిన పద్ధతులను వివరించారు. బాలికల అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, కిషోర బాలికలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం తదితరాలను వివరించారు.

నాణ్యత లోపిస్తే బిల్లులు చెల్లించం

కేవీబీపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లులు చెల్లించమని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ చెప్పారు. మండలంలోని కొత్తూరులో నిర్మిస్తున్న సిమెంటు రోడ్లను సోమవారం ఎంపీడీవో రాధారాణి, పీఆర్ ఏఈలతో కలిసి ఆయన పరిశీలించారు. కొలతల ప్రకారం తగిన మోతాదులో అన్ని వినియోగించి రోడ్లు నిర్మించాలన్నారు. పల్లె పండుగలో భాగంగా ప్రారంభించిన సిమెంటు రోడ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులు నాయుడు, తిరుపతి పార్లమెంటు తెలుగురైతు అధ్యక్షుడు గోపినాథరెడ్డి, సర్పంచ్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో బస్సు రాక ...

ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థుల అవస్థ

సత్యవేడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పరీక్షలకు హాజరయ్యేందుకు సకాలంలో బస్సు రాక ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు అవస్థలు పడ్డారు. సత్యవేడు - టీపీకోట మార్గంలో ఉదయం 7 గంటలకు రావాల్సిన సత్యవేడు ఆర్టీసీ డిపో బస్సు మరమ్మతులకు గురికావడంతో 8 గంటలకైనా రాలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ వాహనాల్లో పిల్లలను పరీక్షా కేంద్రంలో వదిలిపెట్టిరు. పరీక్షల వేళ ఆర్టీసీ యాజమాన్యం ప్రదర్శించిన నిర్లక్ష్య వైఖరిపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో సోమవారం ద్వితీయ సంవత్సర ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 248మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, ఇద్దరు గైర్హాజరైనట్టు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు.

రేపు పంచాయతీ ఆదాయ వనరుల వేలం

నారాయణవనం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆదాయ వనరునలు వేలం వేస్తున్నారు. టూరిస్ట్ బస్టాండు, వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్, ఆటో స్టాండ్, జంతు వధశాల, బస్టాండులోని గదులను బుధవారం ఉదయం 10 గంటలకు పంచాయతీ కార్యాలయ ఆవరణలో వేలం వేస్తున్నట్టు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ధరావతు చెల్లించి, సాల్వెన్సీ సర్టిఫికెట్ సమర్పించి వేలంలో పాల్గొనవచ్చు.

తెలుగుగంగ కాలువలో పడి యువకుడి మృతి

శ్రీకాళహస్తి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): తెలుగు గంగ కాలువలో పడి మతిస్థిమతితం లేని యువకుడు మృతి చెందాడు. వెంకటగిరికి చెందిన కుప్పయ్య(30)కు మతిస్థిమితం లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ సంచరిస్తుంటాడు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. సోమవారం తొట్టంబేడు మండలంలోని సింగమాల సమీపంలో ఉన్న తెలుగుగంగ కాలువలో యువకుడు మృతదేహం పైపుకు తగులుకుని ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

ఎండలకు రోడ్లు నిర్మానుష్యం



జనసంచారంలేని కేవీబీపురం రోడ్డు

కేవీబీపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): సోమవారం కాసిన ఎండకు మండల కేవీబీపురం పట్టణంలోని ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. మండలంలో 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదై ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వేసవి ప్రారంభంలోనే ఈ విధమైన ఎండలు కాస్తుంటే రానురాను పరిస్థితి ఎలా మారుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అత్యవసర పనులు ఉంటే తప్ప ప్రజలు బయటకు రావద్దని తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

చిన్నారి ప్రవాసినిచే భగవద్గీత పఠనం



శ్రీకాళహస్తి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సందర్భంగా ధూర్జటి కళాప్రాంగణంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో పట్టణానికి చెందిన ప్రవాసిని భగవద్గీత 12వ అధ్యాయం పఠించింది. దాని అర్థం ఆంగ్లంలో వివరంగా తెలిపింది. భక్తులు తిలకించి ఆ చిన్నారిని ఆశీర్వదించారు. ఆలయం తరపున ప్రవాసినికి తీర్థప్రసాదాలు, సర్టిఫికెట్ అందజేశారు.

బ్రాస్లెట్ అందజేత



ప్రేమ్‌కుమార్‌కు బ్రాస్లెట్‌ను అందజేస్తున్న పోలీసు, ఆలయ ఉద్యోగి

శ్రీకాళహస్తి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ దర్శనానికి తొట్టంబేడు మండలం కొత్తకండ్రిగకు చెందిన కె.ప్రేమ్‌కుమార్ సోమవారం వచ్చాడు. ఈ క్రమంలో ఆలయంలో తన బ్రాస్లెట్‌ను పోగొట్టుకున్నాడు. దాని విలువ సుమారు రూ.2లక్షలు. ఆలయ పారిశుధ్య విభాగ ఉద్యోగి మాధవయ్యకు అది దొరికింది. దాన్ని ఆయన ఆలయ అధికారులకు అందజేశారు. సీసీ కెమెరాల ద్వారా వారు వివరాలు ఆరా తీసి పోలీసు సిబ్బంది ద్వారా ప్రేమ్ కుమార్‌కు అందజేశారు.